PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 333 | విజయవాడ, శనివారం 6 జులై 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 6 July 2024 | Rs

మందకొడిగా ఖరీఫ్

- 51 మండలాల్లో వర్షాభావం
- కృష్ణా డెల్టాకు నీటి కటకట

లోపలి పేజీలో..

రోడ్రిగ్స్ పోరాటం వృథా

- తొలి టి20 దక్షిణాఫ్రికా చేతిలో అమ్మాయిల ఓటమి
- బ్రిట్స్, కాప్ అర్ధసెంచరీలు

6

నీటి మాఫియా

దేశంలో వ్యాపారులు..అధికారులు..రాజకీయనేతలు కుమ్మక్కు • డౌన్ టు ఎర్త్ పరిశోధన

లక్నోలో పేదల కాలనీలకు అమ్మడానికి వినియోగించిన నీటి ట్యాంకర్లు

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూ ఢిల్లీలో నెలకొన్న తీవ్రమైన నీటిఎద్దడి గురించి కొద్దిరోజులుగా చదువుతూనే ఉన్నాం. ఢిల్లీలోనే కాదు. దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఢిల్లీకి 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో నగరంలోనూ ప్రజలు తాగునీటికి అంగలారుస్తూనే ఉన్నారు. ముంబాయి,జైపూర్, చెన్నై, బెంగళూరు ఇలా అన్ని ప్రధాన నగరాల్లోనూ సామాన్యులకు నీటి కష్టాలు తప్పడం లేదు. తెలుగు రాష్ట్రాల్లోనూ కొన్ని చోట్ల నీటి కొరత ఏర్పడింది. అన్ని ప్రధాన నగరాల్లోనూ తాగునీటి సరఫరాలో ప్రభుత్వ వ్యవస్థ విఫలమవుతుంటే, ప్రైవేటు వ్యాపారుల మాత్రం విచ్చల విడిగా నీటి వ్యాపారం సాగిస్తున్నారు. డబ్బులు చెల్లించగలిగే వారికి ఢిల్లీతో పాటు అన్ని ప్రధాన నగరాల్లోనూ ట్యాంకర్లతో నీటి సరఫరా నిరంతరాయంగా సాగుతోంది. వ్యాపారులు, అధికారులు, రాజకీయనేతలు కుమ్మక్కుతో దేశమంతా సాగుతున్న నీటి మాఫియాపై 'డౌన్ టు ఎర్త్ ' పరిశోధనాత్మక కథనాలను ప్రచురించింది. ప్రధాన నగరాల్లో నెలకొన్న పరిస్థితులు క్లుప్తంగా :

ఢిల్లీలో ...

న్యూఢిల్లీలో నివసించే సామాన్య ప్రజానీకం గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం తీవ్రమైన నీటి కొరతను చూసింది. ఫరీదాబాద్, త్రిలోక్‌పూర్ కాలనీ, సంగంవిహార్ తదితర ప్రాంతాల్లో నీటికొరతకు కారణాలను అన్వేషించే ప్రయత్నాలను డౌన్‌టుఎర్త్ బృందం చేసింది. ఈ అన్ని ప్రాంతాల్లోనూ ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగినట్లు తేలింది. ఒక్కో కుటుంబం ట్యాంకర్ నీటికోసం 3వేల రూపాయల నుండి 5వేల రూపాయల వరకు ఖర్చు చేయాల్సివచ్చింది. ప్రభుత్వ యంత్రాంగం నీటి సరఫరా చేయలేక చేతులెత్తేస్తే ప్రైవేటు వ్యాపారులకు ఎక్కడి నుండి వచ్చాయన్నది చర్చనీయాంశం. దీనికోసం వీరు నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా బోర్లు వేసేశారు. దిగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల్లో కూడా బోర్లు వేసి భూగర్భజలాలను ప్రైవేటు వ్యాపారులు తోడుకున్నారు. ఈ విషయం అధికారులకు తెలియదా అంటే, తెలుసు. కానీ, చూసీ చూడనట్లు ఊరుకుంటున్నారు. కారణం ఏమిటో ఊహించుకోవచ్చు. నీళ్ల వ్యాపారం చేసే వారిలో ఛోటా, మోటా రాజకీయ నేతల నుండి బడా నేతల అనుచరుల వరకు ఉన్నట్లు సమాచారం.

లక్నోలో పేదలకే ...

బిజెపి పాలిత ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో నీటి కొరతలోనూ సామాజిక అంతరాలు కనిపించాయి. ధనికులు, రాజకీయనేతలు, పలుకుబడి కలిగిన వ్యక్తులు నివసించే ప్రాంతాల్లో సమృద్ధిగా నీరు లభించగా, పేదలు నివసించే మురికి వాడల్లో దీనికి భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతాల్లో రోజుల తరబడి కరెంటు సరఫరా నిలిపివేసి మరీ నీటి కొరతను సృష్టిస్తున్నారు. మురికివాడల్లోని ప్రజానీకం ట్యాంకర్‌కు వెయ్యి నుండి రెండు వేలుఖర్చు చేయాల్సివచ్చింది. నీటి కోసం ఈ ప్రాంతాల్లో తీవ్ర కొరత ఏర్పడినా మీడియాలో వార్తలు రాకుండా అధికారయంత్రాంగం జాగ్రత్త పడుతుంది. 'లక్నోలో నీటి కొరత లేదు. ట్యాంకర్లతో సరఫరా చేయాల్సిన పరిస్థితి లేదు' అని అధికారులు మీడియాకు చెబుతారు. అయితే, వాస్తవం ఏమిటంటే లక్నో శివారులోని 'అషియానా' ప్రాంతంలోనే 50కిపైగా ట్యాంకర్లు నీటి సరఫరా వ్యాపారంలో ఉన్నాయి. ఈ ప్రాంతానికి చెందిన హరిప్రసాద్ అనే వ్యక్తి తనకు 12 ట్యాంకర్లు ఉన్నాయని, 15 ఏళ్లకు పైగానీటి వ్యాపారంలో ఉన్నానని చెప్పారు. ఈ వ్యాపారానికి ఎటువంటి లైసెన్స్‌లు అవసరం లేదని కూడా ఆయన చెప్పడం గమనార్హం.

బెంగళూరులో...

ఈ ఏడాది మార్చి నుండి ఏప్రిల్ వరకు దాదాపు 45 రోజుల పాటు దాదాపు బెంగళూరు నగరమంతా నీటి కొరత నెలకొంది. ఇక్కడ కూడా ప్రభుత్వ యంత్రాంగం విఫలమైతే ప్రైవేటు వ్యాపారులు ట్యాంకర్ల ద్వారా నీటిని నిరంతరాయంగా సరఫరా చేశారు. అయితే, 12వేల లీటర్ల ట్యాంకు కోసం సగటు కుటుంబం మూడు వేల నుండి 5 వేల రూపాయల వరకు ఖర్చు చేయాల్సివచ్చింది.. బెంగళూరు నగరంలో గత వేసవిలో దాదాపుగా 3,500 ట్యాంకర్లు నీటి సరఫరా పనిలో ఉన్నట్లు సమాచారం. అధికారులతో పాటు, కొందరు కార్పొరేటర్లు కూడా బినామీ పేర్లతో ట్యాంకర్లను నడుపుతున్నట్లు సమాచారం. ఒక్కో ట్యాంకరు కొనుగోలు కోసం 50 నుండి 55 లక్షల రూపాయలు ఖర్చు చేస్తారని, నీటి సరఫరాకు అనుకూలంగా చేయడానికి, అనుమతుల కోసం మరికొంత ఖర్చు అవుతుందని సమాచారం.

ఆగస్టు 11న నీట్ (పిజి) పరీక్ష

న్యూఢిల్లీ : నీట్ స్కాం నేపథ్యంలో వాయిదా పడిన నీట్ (పిజి) పరీక్షను ఆగస్టు 11న నిర్వహించనున్నారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బిఇఎంఎస్) శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. రెండు షిఫ్టుల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన ఇతర వివరాలు ఎన్‌బిఇఎంఎస్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.. పోటీ పరీక్షల సమగ్రతపై అనుమానాలు తలెత్తడంతో గత నెల 23న జరగాల్సిన నీట్ (పిజి)పరీక్షను వాయిదా వేశారు. మూడు రోజుల క్రితం కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పోటీ పరీక్షలనిర్వహణపై సమీక్షించారు.

నిజాయితీ అభ్యర్థుల ప్రయోజనాలు దెబ్బతింటాయి

కోర్టుకు కేంద్రం అఫిడవిట్

నీట్ పరీక్షలో లీకేజీలు, అక్రమాలు చోటుచేసుకున్నందున ఆ పరీక్షను రద్దు చేయాలన్న పిటిషన్ల వాదనను కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. సుప్రీం కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో నీట్ రద్దు సహేతుకమైన చర్య అనిపించుకోదు, దీనివల్ల నిజాయితీగా పరీక్ష రాసిన లక్షలాదిమంది అభ్యర్థుల ప్రయోజనాలు దెబ్బతింటాయని కేంద్రం వాదించింది. నీట్‌లో అవకతవకలు, అక్రమాలపై సిబిఐ చేత సమగ్ర దర్యాప్తు జరిపిస్తున్నట్లు కేంద్ర విద్యాశాఖ ఆ అఫిడవిట్‌లో తెలిపింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన పరీక్ష విశ్వసనీయతను దెబ్బతీసేలా పెద్ద స్థాయిలో ఎలాంటి రుజువులు లేనందున, ఇప్పటికే ఫలితాలు వెల్లడించిన పరీక్షను రద్దు చేయొద్దని కేంద్రం కోరింది. దీనిపై ఈ నెల 8న విచారణ జరగనుంది.

పెట్టుబడులకు
తలుపులు తెరిచాం

- పిపిపి స్థానంలో పి4 విధానం
- రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యం
- ఢిల్లీ పర్యటన అనంతరం మీడియాతో చంద్రబాబు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో పెట్టుబడిదారులకు, పారిశ్రామిక వేత్తలకు తలుపులు బార్లా తెరిచిఉంచామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు తెలిపారు. రెండు రోజుల చంద్రబాబు ఢిల్లీ పర్యటన శుక్రవారం ముగిసింది. ఈ పర్యటనలో ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా, కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్‌లాల్ ఖట్టర్, హర్దీప్ సింగ్ పూరి, రాందాస్ అథ్వాలే, నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రహ్మణ్యం, 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియా తదితరులను కలిశారు. వేదాంత ఛైర్మన్ అనిల్ అగర్వాల్, ఎన్‌టిపి సిఎమ్‌డి గుర్దీప్ సింగ్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఎఐ) ఛైర్మన్ సంతోష్ యాదవ్, డిజిసిఐఐ చంద్రజీత్ బెనర్జీ, ఫిక్కీ ఉపాధ్యక్షుడు అనంత్ గోయింక, ఫిక్కీ డైరెక్టర్ జనరల్ జ్యోతి విజ్‌తో పాటు ఐదు, ఆరుగురు ఇండస్ట్రీ లీడర్లతో సమావేశం అయ్యారు. అలాగే సెయిల్ డైరెక్టర్ సుఖ్‌బీర్ సింగ్, యూఎస్-ఇండియా స్ట్రేటజీ పార్టనర్‌షిప్ ఫోరం అధ్యక్షుడు ముకేష్ అఘితో భేటీ అయిన చంద్రబాబు, అనంతరం జపనీస్ దౌత్యవేత్త సుజుకీ హిరోషీతో సమావేశం అయ్యారు. అనంతరం 50 అశోకా రోడ్డులోని సిఎం నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే తన తన లక్ష్యమని, ఆ దిశగానే తన రెండు రోజుల ఢిల్లీ పర్యటన సాగిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దల నుంచి సానుకూల స్పందన వ్యక్తమైందని అన్నారు. తమకు పదవులపై ఆశ లేదని, అందుకే కేంద్రంపై ఒత్తిడి చేయలేదని పేర్కొన్నారు. వాజ్‌పేయ్ హయాంలో ఏడు కేబినెట్ మంత్రి పదవులు ఇస్తామన్నారని, అయినా తీసుకోలేదని గుర్తు చేశారు. ఎన్‌డిఎలో ఉన్నందున అప్పుడు స్పీకర్ పదవి తీసుకున్నామని చెప్పారు. ఇప్పుడు కూడా ఎన్‌డిఎ ఇచ్చిన రెండు మంత్రి పదవులే తీసుకున్నామని, ఆ మంత్రి పదవులతో సంతోషంగానే ఉన్నామని అన్నారు. ప్రస్తుతం తన ఢిల్లీ పర్యటనలో కూడా కేంద్ర ప్రభుత్వ ముఖ్యులతో పోస్టుల గురించి, పదవుల గురించి ప్రస్తావించలేదని అన్నారు. రాష్ట్రానికి సహాయ సహకారాలే తమకు ముఖ్యమని తెలిపారు.

మానవ వనరులే పెట్టుబడిగా సంపద సృష్టి

మానవ వనరులే పెట్టుబడిగా సంపద సృష్టిసామని చంద్రబాబు అన్నారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో ఉపాధి కల్పిస్తామన్నారు. పిపిపి నమూనా స్థానంలో పి-4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టనర్‌షిప్) విధానం తెస్తామని చెప్పారు. ఇకపై ఎవరికీ ఇబ్బంది ఉండదని, జనవరిలో జరిగే దావోస్ పెట్టుబడుల సదస్సుకు హాజరవుతానని ప్రకటించారు. రాష్ట్రంలో కులగణన స్థానంలో నైపుణ్య గణన చేస్తామన్నారు. త్వరలో మార్గదర్శకాలు విడుదల చేస్తామని తెలిపారు.

అమరావతికి పూర్వ వైభవం

రాష్ట్రప్రజలు భూతాన్ని వదిలించుకున్నారని, ఆ భూతాన్ని చూసి ఇప్పటికీ పెట్టుబడిదారులు ముందుకు వచ్చేందుకు భయపడుతున్నారని అన్నారు. జగన్ హయాంలో అమరావతి, పోలవరం సహా రాష్ట్రం విధ్వంసానికి గురైందన్నారు. అమరావతికి పూర్వ వైభవం తేవడమే లక్ష్యమన్నారు. అమరావతిలో ఐకానిక్ బిల్డింగ్స్ సహా అన్నీ పూర్తి చేస్తామన్నారు.

సంప్రదింపులతోనే సమస్యలు పరిష్కరించుకోవాలి

రాష్ట్ర విభజన సమయంలోనూ తాను సమ న్యాయమని చెప్పానని, రెండు రాష్ట్రాలు పరస్పర ఆమోదయోగ్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలనేదే తన ఉద్దేశమని అన్నారు. సోదరులైన రెండు రాష్ట్రాల ప్రజలు విడిపోయినా, కలిసిమెలిసి ముందుకు సాగాలన్నదే తన అభిమతమని పేర్కొన్నారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితో సమావేశంలో సానుకూల ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నానని అన్నారు. నదుల అనుసంధానంతో అద్భుతాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. గోదావరి నుంచే మొత్తం దక్షిణాది రాష్ట్రాలకు నీరు ఇవ్వవచ్చన్నారు.

రాజధాని అమరావతిపై
సమగ్ర వ్యవస్థీకృత ఏర్పాట్లు

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి అంశంపై భవిష్యత్‌లో అనిశ్చితి, గందరగోళాలను నివారించడానికి సమగ్రమైన వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో అమరావతి రైతులు, రైతు కూలీల కడగండ్లకు కారణమైన గత ప్రభుత్వ తప్పుడు విధానాలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుని అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయాలని కోరారు. అదే విధంగా రాజధాని అమరావతితోపాటు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికీ చర్యలు తీసుకోవాలని కోరారు. రాజధాని అమరావతి క్యాపిటల్ రీజియన్‌పై 2014 నుండి ఇప్పటి వరకూ జరిగిన పరిణామాలను సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో పొందుపరిచారని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి అభివృద్ధిని ఆటంకపరిచిన అంశాలు, రైతులు సాగించిన ఆందోళనలనూ పొందుపరచడం సముచితమని తెలిపారు.

కౌలు.. పెన్షన్ పదేళ్ల పాటు పొడిగించండి

రాజధాని నిర్మాణం జాప్యం జరిగినందున రైతులకు కౌలు, పేదలకు పెన్షన్ మరో 10 సంవత్సరాలు పొడిగించాలని, ఎసైన్డ్ రైతులకు సమానమైన ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపైన ప్రభుత్వం దృష్టి సారించాలని, ఐదు సంవత్సరాలుగా నిర్ధిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాల్సిన నిర్మాణాలు, అభివృద్ధిపై సమానదృష్టి సారించాలని కోరారు. వీటిపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగస్వాములైన వివిధ తరగతులు, వర్గాలు, ప్రజా సంఘాలతో చర్చించి వారి సలహాలు సూచనలు స్వీకరించి మాస్టర్‌ప్లాను తదితర అంశాల్లో ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా మార్పులు, చేర్పులు చేయాలని కోరారు. భూముల అమ్మకాలు, విదేశీ సంస్థల పాత్ర తదితర అంశాలపై సమగ్ర చర్చ జరగాలని కోరారు. గత అనుభవాల ఆధారంగా రాజధాని నిర్మాణం మోడల్‌లో తగు మార్పులు, చేర్పులు చేయాలని, త్వరితగతిన అమరావతిలో అంసపూర్తిగా మిగిలిపోయిన పనులు పూర్తి చేసుకుని భవిష్యత్ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. అమరావతి, మిగతా 2లో

లోపలి పేజీలో..

దేశవ్యాప్తంగా రెచ్చిపోతున్న గోగూండాలు

- ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు నాయకుల ఆందోళన
- రాయ్‌పూర్‌లో హత్యకు గురైన బాధితులకు పరామర్శ
- కుటుంబానికి రూ.లక్ష చొప్పున సాయం

ఎమ్మెల్సీలుగా రామచంద్రయ్య, హరిప్రసాద్ ఏకగ్రీవం

వేతన బకాయిలకై కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల ధర్నా

విభజన సమస్యలపై ప్రజాభవన్ వేదికగా
నేడు ముఖ్యమంత్రుల భేటీ

- పది అంశాలపై చర్చలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బేగంపేట ఎయిర్‌పోర్టులో చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

విభజన జరిగిన పదేళ్ల అనంతరం సమస్యల పరిష్కారం కోసం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నేడు సాయంత్రం 6 గంటలకు భేటీ కానున్నారు. సమావేశాన్ని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ చట్టం షెడ్యూలు తొమ్మిది, పదిలోని పలు అంశాలతోపాటు అపరిష్కృత సమస్యలపై పరస్పరం చర్చించుకుని పరిష్కరించుకుందామని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల ఒకటో తేదీన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. దీనికి తెలంగాణ ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రజాభవన్లో ఇరువురూ శనివారం సమావేశం కానున్నారు. వీరిద్దరి భేటీకి రెండు రాష్ట్రాల ఉప ముఖ్యమంత్రులతోపాటు ఎపి నుండి మంత్రులు అనగాని సత్యప్రసాద్, బి సి జనార్ధనరెడ్డి, కందుల దుర్గేష్, ఆర్థికశాఖ అధికారులు పాల్గొనున్నారు. తెలంగాణ నుండి ఆర్థికశాఖ మంత్రితోపాటు మరో ఇద్దరు మంత్రులు పాల్గొంటారని ఎపికి సమాచారం ఇచ్చారు. 2014 విభజన చట్టంలో తొమ్మిది, పది షెడ్యూళ్లలో పలు సంస్థల ఆస్తులు, లావాదేవీలపై ఇంకా సమస్యలు అలాగే ఉన్నాయి. పదేళ్లు దాటిన తరువాత రెండు రాష్ట్రాలు వాటిని పరిష్కరించుకోకపోతే కేంద్రం పరిధిలోకి వెళ్లిపోతాయి. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ముఖాముఖి చర్చించుకోవడం ద్వారా పరిష్కరించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. వీటిల్లో హౌసింగ్, విద్యుత్‌శాఖకు సంబంధించి సుమారు రూ.5000 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్‌టిసి భవనాలకు సంబంధించిన ఆస్తుల వివరాలూ తేలలేదు. షెడ్యూల్ 9లో ఉన్న మొత్తం 91 సంస్థల ఆస్తులు, అప్పులు, నగదు నిల్వల పంపిణీపై కేంద్ర హోంశాఖ షీలాబిడే కమిటీ వేసింది. వీటిలో 68 సంస్థలకు సంబంధించి అభ్యంతరాలేమీ మిగతా 2లో

'లేబర్' అఖండ విజయం

• బ్రిటన్ కొత్త ప్రధానిగా కీర్ స్టార్మర్ • 14 ఏళ్ల టోరీల పాలనకు తెర

విజయం అనంతరం మాట్లాడుతున్న కీర్ స్టార్మర్

లండన్: బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో కీర్ స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ అఖండ విజయం సాధించింది. బకింగ్ హామ్ ప్యాలెస్‌లో రాజు చార్లెస్-3తో శుక్రవారం భేటీ అయిన అనంతరం నూతన ప్రధానిగా స్టార్మర్‌ను అధికారికంగా ప్రకటించారు. ఆ వెంటనే ఆయన ప్రధాని అధికారిక నివాసమైన టెన్ డౌన్ స్ట్రీట్‌లో అడుగుపెట్టారు. టెన్ డౌనింగ్ స్ట్రీట్ వెలుపల ఆయన తొలి ప్రసంగం చేస్తూ, 'మన దేశం నిర్ణయాత్మక మార్పుకు ఓటేసింది. రాజకీయాల నుంచి ప్రజా సేవకు తిరిగొద్దాం' అని పిలుపునిచ్చారు. మార్పు అంటే ఒకరి చేతిలోంచి అధికారం మరొకరి చేతికి మారడం కాదని స్టార్మర్ అన్నారు. ప్రపంచం అంతకంతకూ అస్థిరంగా మారుతోంది. మార్పు కోసం ఇప్పటి నుంచే కృషి ప్రారంభిద్దామని అన్నారు.. నాలాంటి కార్మికవర్గ కుటుంబాలు తమ జీవితాలను తీర్చిదిద్దుకోగలిగే పరిస్థితిని తీసుకురావడంపై దృష్టి కేంద్రీకరిస్తానన్నారు. అస్తవ్యస్థమైన జాతీయ ఆరోగ్య వ్యవస్థను తిరిగి పట్టాలపైకి ఎకిస్తానని, దేశ సరిహద్దులను పదిలంగా కాపాడతానని, పాఠశాలల అవసరాలు తీర్చుతానని, అందరికీ అందుబాటులో ఇళ్ల ధరలు ఉండేలా చూస్తానని కొత్త ప్రధాని హామీ ఇచ్చారు. 'మీ పిల్లలకు బ్రిటన్ మెరుగైన భవిష్యత్ ఇస్తుందని నమ్ముతున్నారా అని మిమ్మల్ని నేనడిగితే మీలో చాలా మంది లేదు అని చెబుతారు. ఆ విషయం నాకు తెలుసు. మీరు తిరిగి నమ్మేంతవరకు మా ప్రభుత్వం పోరాడుతుంది' అని ఆయన చెప్పారు.ఈ ఎన్నికల్లో కన్సర్వేటివ్ పార్టీ ఘోర పరాజయానికి నైతిక బాధ్యత వహిస్తూ రిషి సునాక్ తన ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. అలాగే కన్సర్వేటివ్ పార్టీ నాయకత్వ స్థానం నుంచి కూడా తప్పుకున్నారు.

650 స్థానాలున్న బ్రిటన్ పార్లమెంటు దిగువ సభ (హౌస్ ఆఫ్ కామన్స్) ఎన్నికల తుది ఫలితాలు వెల్లడి కావడానికి ఇంకా కొంత వ్యవధి పట్టవచ్చు. అయితే, ఇప్పటివరకు వెల్లడైన ఫలితాలు, ఆధిక్యతలను బట్టి చూస్తే, లేబర్ పార్టీ 412 సీట్లు గెలుచుకుంది. కన్సర్వేటివ్స్‌కు121 స్థానాలు దక్కాయి. మొత్తం మీద కన్సర్వేటివ్స్ పద్నాలుగేళ్ల పాలనకు బ్రిటన్ ప్రజలు చరమగీతం పాడారు.

చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న ఎంపి కలిశెట్టి

అమరావతికి ఎంపి కలిశెట్టి తొలి జీతం

ప్రజాశక్తి- విజయనగరం కోట

రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తన తొలి జీతాన్ని విరాళంగా అందజేశారు. భారత పార్లమెంట్ ద్వారా తనకు తొలిసారిగా అందిన రూ.1.57 లక్షల చెక్కును ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఎవరైనా తన తొలి జీతం తల్లిదండ్రులకు ఇస్తారని, అమరావతి అభివృద్ధికి తనకు తండ్రి సమానులైన చంద్రబాబుకు అందజేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపి కలిశెట్టిని ముఖ్యమంత్రి అభినందించారు.

పింఛను లబ్ధిదారులకు అండగా నిల్చినందుకు
సిపిఎం నాయకునిపై టిడిపి దాడి

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

రామారావును పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ తదితరులు

రొంపిచర్ల మండల సిపిఎం శాఖా కార్యదర్శి, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావుపై టిడిపి నాయకులు శుక్రవారం దాడి చేశారు. పింఛను లబ్ధిదారులకు అండగా నిల్చినందుకు కక్షకట్టి ఈ దారుణానికి పాల్పడ్డారు. బాధితుని కథనం ప్రకారం... నరసరావుపేట నియోజకవర్గం రొంపిచర్ల మండలం పరగటిచర్ల గ్రామంలోని ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛనుదారులు ఈ నెల ఒకటిన తన ఇంటి వద్దకు వచ్చి పింఛను తీసుకోవాలంటూ టిడిపి నాయకులు, మాజీ ఎంపిపి చిగురుపాటి ఆదినారాయణ గ్రామంలో దండోరా వేయించారు. ఈ నేపథ్యంలో పింఛను కోసం ఆయన ఇంటికి వెళ్లిన కొందరు లబ్ధిదారులను టిడిపి నాయకులు దుర్భాషలాడారు. పింఛను ఇవ్వకుండా మళ్లీ రమ్మని చెప్పి పంపేశారు. దీంతో, సిపిఎం గ్రామ నాయకులు కామినేని రామారావును బాధితులు ఆశ్రయించారు. ఆయన సూచన మేరకు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయగా, బుధవారం లబ్ధిదారులకు పింఛను పంపిణీ జరిగింది. లబ్ధిదారులకు మద్దతుగా నిలవడాన్ని ఓర్వలేని మాజీ ఎంపిపి అనుచరులు 15 మందికిపైగా శుక్రవారం కామినేని రామారావు ఇంటిపై దాడి చేశారు. కొంతమంది బయట కాపలా ఉండి నలుగురు లోపలికి వెళ్లారు. ఇంటిలో నిద్రిస్తున్న రామారావును కుడి భుజంపైనా, వీపుపైనా, చేతులపైనా కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ విషయం తెలుసుకొని ఆయనను నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి సిపిఎం నాయకులు సరికొండ వెంకటేశ్వరరాజు తరలించారు. తనపై టిడిపికి చెందిన ఏల్చూరి పుల్లారావు, నాగరాజు, వెంకటేశ్వర్లు, రామ బ్రహ్మం మిగతా 5లో

ఎగసిపడుతున్న పట్టిసీమ నీళ్లు

పట్టిసీమ ఎత్తిపోతల పైప్ లీక్

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ లీకైంది. సుమారు 50 అడుగుల మేర నీరు ఉవెత్తున ఎగసిపడుతుతోంది. పట్టిసీమ వద్ద గోదావరి నీటిమట్టం 14 అడుగులు ఉండటంతో 15 మోటార్లతో 5250 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదికి తరలిస్తున్న సంగతి తెలిసిందే. పట్టిసీమ నుంచి డెలివరీ పాయింట్ మధ్యలో ఒక పైప్‌లైన్ లీక్ అవ్వడంతో చుట్టుపక్కల పొలాల్లోకి నీరు వెళ్లిపోయింది. రైతులు సమాచారం ఇవ్వడంతో పైప్‌లైన్‌కు సంబంధించిన మోటర్‌ను అధికారులు నిలుపు చేశారు. దీనిపై ఇరిగేషన్ డిఇ పెద్దిరాజును వివరణ కోరగా కొన్నేళ్లుగా ఆ లీకేజీ ప్రాంతంలో పైప్‌లైన్ బోల్టులను తీసి మోటార్ల ద్వారా తమ పొలాల్లోకి రైతులు నీటిని మళ్లించేవారని, దానివల్లే పైపులైన్ లీకేజీ ఏర్పడిందని చెప్పారు. త్వరలోనే మరమ్మతులు చేసి నీటి తరలింపు పునరుద్ధరిస్తామన్నారు.

జగన్ తీరు మారలేదు

- పల్లా శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి అధినేత జగన్ తీరు మారలేదని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఇవిఎం బాక్సును ధ్వంసం చేసి మాచర్లలో విధ్వంసం సృష్టించిన వ్యక్తిని, ఒక నేరస్తుడిని జగన్ వెనకేసుకురావడం సిగ్గుచేటని అన్నారు. గత ఐదేళ్ల ప్రజలను మోసం చేసింది జగన్ అని విమర్శించారు. జాబ్ కేలండరు పేరుతో నిరుద్యోగులను, పిఆర్‌సి ఆశ చూపి ఉద్యోగులను మోసం చేశారన్నారు. 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను కబ్జా చేశారన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టుతో మాచర్ల ప్రజలు పండగ చేసుకుంటున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. ఇవిఎం బాక్సును ధ్వంసం చేసి జైలుకు వెళ్లిన పిన్నెల్లిని అమాయకుడని జగన్ అనడం సబబు కాదన్నారు. నిజాయితీ కలిగిన అధికారితో పల్నాడు ఎస్‌పి దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

అవయవదానంతో ఆరుగురికి కొత్త జీవితం

- ప్రమాదంలో మరణించిన న్యాయవాది

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

న్యాయవాది శివప్రసాద్ (ఫైల్)

బ్రెయిన్ డెడ్ అయిన న్యాయవాది మరో ఐదుగురికి కొత్త జీవితాన్నిచ్చారు. ఆయన అవయవాలను గ్రీన్ ఛానల్ పలు ఆస్పత్రులకు తరలించారు. గుంటూరు జిల్లా పాత మంగళగిరికి చెందిన మునగపాటి శివప్రసాద్ (41) న్యాయవాదిగా పని చేస్తున్నారు. టిడిపి లీగల్ సెల్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శిగానూ వ్యవహరిస్తున్నారు. ఈనెల 2న తన చిన్నారి పుట్టిన రోజు సందర్భంగా బిర్యాని కోసం స్నేహితుడితో కలిసి మండలంలోని నూతక్కికి వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఆయన్ను మంగళగిరి శివారు తెనాలి రోడ్డులోని వడ్లమూడి కోకోకోలా కంపెనీ సమీపంలో లారీ ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలైన శివప్రసాద్‌ను ఎన్నారై ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్‌డెడ్ అయినట్లు శుక్రవారం రాత్రి వైద్యులు నిర్ధారించారు. అవయవదానానికి కుటుంబసభ్యులు అంగీకరించడంతో గుండెను తిరుపతి పద్మావతి ఇన్‌స్టిట్యూట్‌కు, కాలేయాన్ని విజయవాడ మణిపాల్ హాస్పిటల్‌కు, ఊపిరితిత్తులను సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌కు, మూత్రపిండాలను చినకాకాని ఎన్నారై, ఆయుష్ ఆస్పత్రులకు, కళ్లను గుంటూరు జిల్లా పెదకాకాని శంకర నేత్రాలయానికి శుక్రవారం మధ్యాహ్నం గ్రీన్ ఛానల్ ద్వారా తరలించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సర్టిఫైడ్ కాపీలు ఎందుకివ్వలేదు?

- వివరణ ఇవ్వాలని కింది కోర్టు పిఒకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని కోరుతూ సస్పెన్షన్‌లో ఉన్న జడ్జి ఎస్ రామకృష్ణ మూడేళ్ల క్రితం చేసిన ఫిర్యాదులో చిత్తూరులోని కోర్టు సర్టిఫైడ్ కాపీలు ఎందుకివ్వలేదని హైకోర్టు ప్రశ్నించింది. రెండు రోజుల్లోగా పిటిషనరు రామకృష్ణకు సర్టిఫైడ్ కాపీల ప్రతులను అందజేయాలని సంబంధిత కోర్టు న్యాయాధికారి (పిఒ)ను ఆదేశించింది. పిటిషనరు అధికారికంగా కోర్టు ఉత్తర్వుల ప్రతిని కోరితే ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వలేదో వివరణ ఇవ్వాలని పిఒను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆదేశించింది. పెద్దిరెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదుకు ఉత్తర్వులివ్వాలంటూ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న రామకృష్ణ చిత్తూరులోని మొదటి అదనపు జిల్లా కోర్టు/ఎస్‌సి, ఎస్‌టి కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఆ కోర్టు జారీ చేసిన ఉత్తర్వుల సర్టిఫైడ్ కాపీని అందజేయాలని రామకృష్ణ దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇవ్వలేదంటూ హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేయడంతో పైవిధంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. తదుపరి విచారణ ఈ నెల 19కి వాయిదా పడింది.

మేధా పాట్కర్‌కు శిక్ష అమానుషం

- ప్రజాతంత్ర వాదుల ఆగ్రహం
- దేశవ్యాప్త ఆందోళన ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నర్మదా బచావో ఆందోళన నాయకులు మేధాపాట్కర్‌కు శిక్ష వేయడం అమానుషమని, ప్రజాస్వామ్యంపై దాడి అని వామపక్ష నాయకులు, ప్రజాతంత్ర వాదులు పేర్కొన్నారు. ఆమెకు వేసిన శిక్ష, జరిమానాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ప్రజాతంత్ర వాదుల విలేకరుల సమావేశంలో రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో పర్యావరణ విధ్వంసం, ఆదివాసులను తరలించడం, దళితులపై దాడులు చేయడం, నగరాల్లో పేదలు, కార్మికులను తరిమేస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన మేధాపాట్కర్ రాజీలేని పోరాటం చేస్తున్నారని అన్నారు. నర్మదా బచావో ఆందోళన సందర్భంగా సరోవర్ డ్యామ్ కట్టడం వల్ల ఆదివాసుల మనుగడకు ఎలాంటి నష్టం, ప్రమాదం జరుగుతుందో ప్రపంచానికి తెలిపారని, వారికి న్యాయం చేయకుండా డ్యాములు కట్టి నీటిలో ముంచడం అన్యాయమని పోరాటం చేశారని తెలిపారు. నిర్వాసితుల సమస్యలను చర్చనీయాంశం చేసి వారికి రక్షణగా నిలబడ్డారని అన్నారు. ఆ సమయంలో స్వచ్ఛద సంస్థను నడుపుతున్న ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నర్మదా బచావో ఆందోళనను తప్పుబడుతూ ప్రచారం చేశారన్నారు. దానిపై ప్రశ్నించినందుకు ఇప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్ హోదాలో ఐదు నెలల జైలుశిక్ష, పదివేల జరిమానా విధించడం అమానుషమని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మేధాపాట్కర్‌కు విధించిన శిక్షను నిరశిస్తూ ప్రజాస్వామ్యవాదులుగా అందరం గళమెత్తాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎప్పుడో మాట్లాడిన అంశంపై ఇప్పుడు కేసుపెట్టి జైలుశిక్ష విధించడం అంటే ఆదివాసీ హక్కులపైగానీ, నిర్వాసితుల సమస్యలపై గానీ ప్రభుత్వానికి ఏమాత్రమూ గౌరవం లేదని తేలిపోయిందన్నారు. వీటిపై రాజీలేని పోరాటం చేస్తున్న మేధాపాట్కర్‌ను శిక్షించడం అంటే ఆదివాసుల హక్కులను తుంగలో తొక్కడమేనన్నారు. నిర్వాసితుల పట్ల ప్రభుత్వాల వైఖరి దీనినిబట్టి అర్థమవుతుందని విమర్శించారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడు న్యాయ చట్టాలను అమలులోకి తీసుకొచ్చి వాటిని సామాన్య ప్రజలపైనా, ప్రశ్నించేవారిపైనా ప్రయోగిస్తున్నారని అన్నారు. ఇది ప్రజాస్వామ్య ఉద్యమాలను గొంతునొక్కడం తప్ప మరొకటి కాదని అన్నారు. దీనిపై వడ్డే శోభనాద్రీశ్వరరావు చేపట్టనున్న కార్యక్రమానికి సంఘీభావం ప్రకటించారు. న్యాయ స్థానాలు కూడా ప్రజాస్వామ్య హక్కులపట్ల సముచితంగా వ్యవహరించాలని తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో నిర్వాసితుల సమస్యలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయని, వారి సమస్యలను తెలుగుదేశం, జనసేన పార్టీలు కూడా పట్టించుకోవాలని పేర్కొన్నారు. మేధాపాట్కర్ అరెస్టును ఎన్‌డిఎలో భాగస్వాములుగా ఉన్న ఆ రెండు పార్టీలు కూడా ఖండించాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. సామాజిక కార్యకర్తగా అట్టడుగు తరగతుల ప్రజలకు అండగా నిలబడుతున్న మేధాపాట్కర్ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. అరుంధతీరాయ్ విషయంలోనూ దుర్మార్గంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. భీమాకోరేగావ్ ఘటనలో బిజెపిని ప్రశ్నించిన వారిని తొమ్మిదేళ్ల పాటు జైళ్లలో పెట్టారని వివరించారు. ప్రభుత్వ దమనకాండను ఖండించాల్సిన బాధ్యత ప్రజాతంత్రవాదులపై ఉందని అన్నారు. మూడోసారి మోడీ ప్రభుత్వం తెలుగుదేశం, జెడియు లాంటి వారిపై ఆధారపడి ఉందని, మార్పు ఉంటుందని భావించారని, అటువంటిదేమీ కనబడకపోగా బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉందనే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు కేంద్రంలో ఉన్నాయని, వారిద్దరూ మేధాపాట్కర్, అరుంధతీరాయ్ విషయంలో స్పందించాలని అన్నారు. రాష్ట్రంలో వారిని జైల్లో పెడితే ప్రజాస్వామ్యానికి నష్టం వాటిల్లిందని ప్రచారం చేశారని, నిజమైన ప్రజాస్వామ్యవాదులను జైల్లో పెడితే మాత్రం నోరెత్తడం లేదని అన్నారు. వారు కూడా ఈ చర్యను ఖండించాలని కోరారు. రైతు కూలీ సంఘం నాయకులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై ఏమాత్రమూ విలువ లేదని, ప్రశ్నించిన వారిని చంపేయడమే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. దీన్ని ఖండించకపోతే ప్రజాస్వామ్యానికి, ప్రజాతంత్ర వాదులకు రక్షణ ఉండదన్నారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పొలారి మాట్లాడుతూ బిజెపి తీరుపై దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యయుత ఆందోళన చేపట్టాలని కోరారు.

మీడియాతో మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు, చిత్రంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు, కె.రామకృష్ణ

బకాయి వేతనాలకై సిహెచ్‌డబ్ల్యుల ధర్నా

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

ఐటిడిఎ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు

తమకు బకాయి ఉన్న ఐదు నెలల వేతనాలు చెల్లించాలని కోరుతూ పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయం వద్ద కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు (సిహెచ్‌డబ్ల్యులు) శుక్రవారం ధర్నా చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ కోశాధికారి కె.బృందావత్ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలందిస్తోన్న సిహెచ్‌డబ్ల్యులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. గుర్తింపు కార్డులు, యూనిఫారాలు ఇవ్వాలని అధికారులకు అనేకసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి బకాయిలు వేతనాలను వెంటనే చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ వి.ఇందిర మాట్లాడుతూ సిహెచ్‌డబ్ల్యులను ఆశా వర్కర్లగా మార్పు చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ సిహెచ్‌డబ్ల్యులకు ప్రతి నెలా సకాలంలో వేతనాలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై పిఒ స్పందిస్తూ, మూడు రోజుల్లో రెండు నెలల వేతన బకాయిలు చెల్లిస్తామని, వారం రోజుల్లో మొత్తం వేతన బకాయిలు క్లియర్ చేస్తామని, యూనిఫారం త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌డబ్ల్యులు కుమారి, అప్పలనరసమ్మ, భారతి, జీవిత, దమయంతి, దివ్య, అరుణ, ధనలక్ష్మి, రజిని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జయంతిని ఘనంగా నిర్వహించండి

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని ఘనంగా నిర్వహించాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయం నుండి పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో సజ్జల వీడియో కాన్ఫరెన్సు ద్వారా శుక్రవారం మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణించి 15 ఏళ్లయినా ఇప్పటికీ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. పార్టీ కుటుంబ సభ్యులందరూ రక్తదానం, స్కూల్స్‌లో పుస్తకాల పంపిణీ, రహదారులు, కాలనీల్లో చెట్లు నాటడం వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు.

జగన్‌ను కలిసిన ముద్రగడ

రాష్ట్రంలో ఎన్నికల అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వైసిపి నేతల వరుస భేటీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తాడేపల్లిలోని జగన్ క్యాంపు కార్యాలయానికి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తదితరులు వచ్చి కలిశారు.

మందకొడిగా ఖరీఫ్

- 51 మండలాల్లో వర్షాభావం
- కృష్ణా డెల్టాకు నీటి కటకట

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

జులై మొదటి వారం గడుస్తున్నా ఖరీఫ్ సేద్యం మందకొడిగా సాగుతోంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు మొత్తమ్మీద వర్షాలు ఆశాజనకంగా ఉన్నా క్రమానుగతంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పడలేదు. నాలుగు జిల్లాల్లో సాధారణం, 11 జిల్లాల్లో ఎక్కువ, 11 జిల్లాల్లో మరీ ఎక్కువ స్థాయిల్లో వర్షాలు కురిశాయి. జూన్ 1 నుంచి జులై 5 వరకు నార్మల్‌గా 116.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 170.4 మిమీ పడింది. నార్మల్ కంటే 46.5 శాతం ఎక్కువ కురిసింది. కాగా రాష్ట్రంలోని 51 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళం జిల్లాలో 11 మండలాలు, విజయనగరం 4, మన్యం 6, అల్లూరి 6, కోనసీమ 1, తూర్పుగోదావరి 1, కృష్ణా 2, బాపట్ల 1, పల్నాడు 7, ప్రకాశం 7, నెల్లూరు, కర్నూలు, కడప, అన్నమయ్య, తిరుపతి ఒకటి చొప్పున మండలాల్లో తక్కువ వర్షం పడింది. ఈ తడవ ప్రధాన ప్రాజెక్టుల్లో నీరు లేని కారణంగా వరి సాగుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. గోదావరి డెల్టాలో కాసింత పరిస్థితి మెరుగ్గా ఉండగా, నీరు లేక కృష్ణా డెల్టాలో నారుమళ్లు పోయలేదు. పులిచింతల ఖాళీ అయిపోయింది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో తగినంత నీరు లేదు. గోదావరిలో మొన్ననే నీటి ప్రవాహం ఒక మోస్తరుగా పెరగడంతో పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాలో నారుమళ్లకు నీరు విడుదల చేశారు. నారుమళ్లు ఆలస్యమైతే పంట ఆలస్యమవుతుంది. సాధారణంగా నవంబర్, డిసెంబర్‌లలో బంగాళాఖాతంలో తుపాన్లు, వాయుగుండాలు పడతాయి. అప్పటికి కోతలు పూర్తి కాకపోతే పంట నష్టం జరిగే ప్రమాదం ఉంది. ఇదిలా ఉండగా వర్షాలు మెట్ట పంటల సాగుకు అనుకూలంగా ఉన్నప్పటికీ సేద్యం మందకొడిగానే సాగుతోంది. సీజన్ మొత్తమ్మీద సాధారణ సాగు 81.25 లక్షల ఎకరాలు కాగా ఇప్పటికి 10.35 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కావాలి. కానీ 7.62 లక్షల ఎకరాల్లోనే పంటలు వేశారు. సీజన్ సాగులో ఆరు శాతం, ఇప్పటికి కావాల్సిన సాగులో 73 శాతం పంటలు సాగయ్యాయి. ఇప్పటికి కావాల్సిన సాగులో వరి 69 శాతం, తృణధాన్యాలు వందశాతానికిపైగా, పప్పుధాన్యాలు వందశాతానికిపైగా, మొత్తం ఆహార ధాన్యాలు 89 శాతం మేర సాగయ్యాయి. నూనెగింజలు 59 శాతం, పత్తి 78 శాతం సాగయ్యాయి. రాయలసీమలో వర్షాలు బాగానే పడ్డప్పటికీ వేరుశనగ 57 శాతమే సాగైంది.

అంబేద్కర్ ఫ్లెక్సీ చించిన దుండగులు

- దళిత యువకుడి ఇంటిపై దాడి
- గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - పిఠాపురం (కాకినాడ జిల్లా)



దుండగులు చించేసిన ఫ్లెక్సీ

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో అంబేద్కర్ ఫ్లెక్సీని దుండగులు చించివేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా గ్రామంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా గ్రామంలోని రాజు మిల్లు సమీపంలో ఎస్‌సి కాలనీ వద్ద దళితులు భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి వంగవీటి మోహన్‌రంగ జయంతి గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ ఎస్‌సి కాలనీ సమీపానికి చేరుకుంది. ఈ సమయంలో కొంతమంది దుండగులు అంబేద్కర్ ఫ్లెక్సీని చించివేశారు. అనంతరం అదే కాలనీలో నివాసం ఉంటున్న దళితుడు ఎస్.శ్రీనివాస్ ఇంటిపై ర్యాలీలో పాల్గొన్న ఎం.సాయి మరికొంత మంది యువకులు మద్యం, కూల్ డ్రింక్ సీసాలతో దాడి చేశారు. కులం పేరుతో దూషిస్తూ అవమానకరంగా మాట్లాడారని గొల్లప్రోలు పోలీసులకు శ్రీను ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా ప్రాంతాన్ని మాలమహానాడు నాయకులు సందర్శించారు.

పర్స సత్యనారాయణ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

పోరాటాలకు స్ఫూర్తి పర్స

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మికులు, శ్రామికులు, కర్షకుల కోసం నిరంతరం పోరు సాగించిన పర్స సత్యనారాయణ పోరాటాలు స్ఫూర్తిదాయకమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. కార్మికోద్యమ నిర్మాత, మార్క్సిస్టు యోధుడు పర్స సత్యనారాయణ శత జయంతి సభను అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ఆహ్వానితులుగా, జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నర్సింగరావుతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పర్స సత్యనారాయణ జీవిత విశేషాలు, పోరాటాలు, సాధించిన విజయాలపై రూపొందించిన పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం నర్సింగరావు మాట్లాడుతూ.. తెలంగాణా సాయుధ పోరాటం, సింగరేణి బొగ్గు గనుల కార్మికుల హక్కుల సాధన, కనీస వేతనాల పెంపుదల కోసం పర్స సత్యనారాయణ చేసిన పోరాటాలు చారిత్రకంగా నిలిచిపోయాయని తెలిపారు. ఆంధ్ర మహాసభ పేరుతో పటేల్, పత్వారీ వ్యవస్థను పర్స సత్యనారాయణ, సిఐటియు ప్రధాన కార్యదర్శి నండూరు ప్రసాదరావు నిర్మూలించగలిగారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ సాధన పోరాటాల్లో తనదైన పాత్ర పోషించారని వివరించారు. కార్యకర్తలు నాయకులు కావాలని, వారందరూ రాజ్యాధికారం చేపట్టాలనే సంకల్పంతో పని చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌టిఆర్ శ్రీనివాసులు, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా, జిల్లా నాయకులు గోపాల్, రమాదేవి, శకుంతల, కె.నాగభూషణ, ఎటిఎం.నాగరాజు, ఎజి.రాజమోహన్, జమున పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు

'ఉక్కు' ప్రయివేటీకరణను కేంద్రం విరమించుకోవాలి

- విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి డిమాండ్

ప్రజాశక్తి. - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని విరమించుకుంటున్నట్టు తక్షణం కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో జెఎసి ఛైర్మన్ ఎం జగ్గునాయుడు అధ్యక్షతన శుక్రవారం విస్తృత సమావేశం జరిగింది. విశాఖ ఉక్కు కర్మాగారం పట్ల కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కుట్రపూరిత చర్యలపై జెఎసి నాయకులు చర్చించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల అమలు వంటి చర్యలు చేపట్టిన బిజెపికి పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు మెజారిటీ లేకుండా తీర్పునివ్వడాన్ని సమావేశం హర్షించింది. ఇకనైనా కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం దివాళాకోరు ప్రయివేటీకరణ విధానాలపై వెనక్కి తగ్గాలని డిమాండ్ చేశారు. ఎన్‌డిఎ ప్రభుత్వం రాష్ట్ర టిడిపి కూటమి కీలక మద్దతుతో ఏర్పడిందని, ఇది విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో ఉంచేందుకు దోహదపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని, పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని, ప్లాంటుకు వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని, ఉద్యోగ ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని గనుల లీజును వెంటనే రెన్యువల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచేందుకు జిల్లా ఉన్నతాధికారులను, ప్రజా ప్రతినిధులను కలిసి మరోమారు వినతులు అందజేయాలని నిర్ణయించారు. సమావేశంలో జెఎసి వైస్ ఛైర్మన్లు భోగవిల్లి నాగభూషణం, ఎం.మన్మధరావు, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్ కనకారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు, టిఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టియు, వైఎస్ఆర్‌టియుసి, ఎఐసిటియు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ, ఐద్వా, డివైఎఫ్ఐ, ప్రజానాట్యమండలి, కెవిపిఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టుల పనులు

- అధికారులకు మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వర్షం ద్వారా వచ్చే ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టాలని అధికారులను జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వున్న సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ఈ ఖరీఫ్ సీజన్‌లో శివారు భూములకు కూడా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జలవనరులశాఖ ఇంజినీర్లతో రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టుల్లోకి వచ్చే ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోపై, ప్రాజెక్టుల గేట్లు, లాక్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కాలువల్లో పేరుకుపోయిన సిల్టు, చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించే పనులు చేపట్టాలన్నారు. ప్రాజెక్టుల పరిధిలో ఆయకట్టు భూములకు ప్రణాళికాబద్ధంగా నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు కూడా రూపొందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గుండ్లకమ్మ, పులిచింతల, అన్నమయ్య ప్రాజక్టుల గేట్లు కొట్టుకుపోయాయని, పులిచింతల ప్రాజెక్టులో నిల్వ ఉండాల్సిన 30 నుండి 40 టిఎంసిలకు బదులు కేవలం 0.5 టిఎంసిల నీరు ఉందని, ఇలాంటి పరిస్థితులు తమ ప్రభుత్వంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పులిచింతల ప్రాజెక్టులో తగిన స్థాయిలో నీటి నిల్వలు లేకపోవడం, పట్టిసీమ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన కారణంగా కృష్ణా డెల్టాలో తాగునీటి సరఫరా చేయలేని పరిస్థితి వచ్చిందన్నారు. గత నాలుగేళ్లుగా పట్టిసీమ నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో గేట్లు, బోల్టులు తుప్పుపట్టి లీకేజీలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో 15 పంపులు పనిచేస్తున్నాయని, రానున్న రోజుల్లో 24 పంపులను పనిచేయించి కృష్ణా డెల్టాకు పూర్తిస్థాయిలో నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మోటూరుపాలెంలో డయేరియా

కలుషిత ఆహారంతో 18 మందికి వాంతులు, విరేచనాలు

ప్రజాశక్తి - అచ్యుతాపురం (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం సెజ్ పునరావాస కాలనీ మోటూరుపాలెంలో కలుషిత ఆహారం తినడం వల్ల 18 మంది డయేరియా బారిన పడ్డారు. వాంతులు, విరేచనాలతో మంగళవారం నుంచీ వారంతా అస్వస్థతకు గురవుతూ వస్తున్నారు. వారిలో కక్కల మేఘన, పంచదారల నాగమణి, పంచదారల ఫణీంద్ర, కక్కల వినయ్, కక్కల అశ్వినిలను శుక్రవారం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆస్పత్రిలో కక్కల రమ్య, దమ్ము సాయి, దొక్క అప్పలనర్సమ్మ, అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముప్పిడి భవ్య, ముప్పిడి ఝాన్సీ, ముప్పిడి వంశీ, ముప్పిడి సురేష్, డేవిడ్ రాజ్, నూకరత్నం వైద్య సేవలు పొందుతున్నారు. అస్వస్థతకు గురైన వారందరూ గ్రామంలో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తిన్నట్టు వైద్యులు తెలిపారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మోటూరిపాలెం గ్రామాన్ని సందర్శించారు. అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించారు.

నేడు ముఖ్యమంత్రుల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

లేవు. మిగతా 23 సంస్థల పంపిణీపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. పదో షెడ్యూల్‌లో ఉన్న 142 సంస్థల్లో తెలుగు అకాడమీ, తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ యూనివర్సిటీ వంటి 30 సంస్థల పంపిణీపై ఇంకా వివాదాలున్నాయి. ఇప్పటికీ విద్యుత్ ఉద్యోగులు 1200 మందికిపైగా అక్కడ ఉండిపోయారు. ఎపిలోనూ 1200 మందికిపైగా ఉన్నారు. ఉద్యోగులను పరస్పరం మార్పిడి చేసుకునే అంశంపై గతంలో చర్చలు జరిగినా చివరి నిమిషంలో ఆగిపోయాయి. ఉమ్మడిగా తెలంగాణలో ఉన్న భవనాలపై చర్చించుకుని వాటిని ఏమిచేయాలనే నిర్ణయానికి రావాల్సి వుంది. దీనికోసం అప్పట్లో సలహాదారుగా పనిచేసిన కుటుంబరావు ఒక నివేదికను తయారు చేసినట్లు తెలిసింది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా హైదరాబాద్‌లో ఆందుబాటులో ఉండాలని సిఎం సూచించారు. విభజన అంశాలకు సంబంధించి కోర్టుల్లో ఉన్న కేసుల వివరాలనూ సమర్పించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు.

హైదరాబాద్‌లో చంద్రబాబుకు ఘనస్వాగతం

చంద్రబాబునాయుడుకు హైదరాబాద్‌లో ఆ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యేందుకు బేగంపేట విమానాశ్రయానికి వచ్చిన చంద్రబాబుకు తెలుగుదేశం పార్టీ తెలంగాణ శ్రేణులు భారీస్థాయిలో స్వాగతం పలికాయి. బేగంపేట ఎయిర్‌పోర్టు బయటకు చంద్రబాబు రాగానే 'జై తెలుగుదేశం, జై చంద్రబాబు' అంటూ నినాదాలు చేశారు. రోడ్డు మొత్తం ఆ పార్టీ శ్రేణులతో నిండిపోయింది. ఎయిర్‌పోర్టు నుంచి జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసం వరకు ప్రదర్శన సాగింది.

రాజధాని అమరావతిపై సమగ్ర వ్యవస్థీకృత ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

సిఆర్‌డిఎ ప్రాంత అభివృద్ధి భవిష్యత్ ప్రణాళిక గురించి శ్వేతపత్రంలో ప్రస్తావించలేదని, గత పది సంవత్సరాల నుండి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఢిల్లీని తలదన్నే రాజధానిని ఏర్పాటు చేస్తామని హామీనిచ్చినా నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిందని తెలిపారు. ఇప్పటికైనా రాజధాని నిర్మాణానికి విభజన చట్ట ప్రకారం నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించాలని,. రోడ్లు, రైల్వే ప్రాజెక్టులు, మెట్రో, కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటు తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. భూసమీకరణ చట్ట ప్రకారం రైతులకు ప్లాట్లు అభివృద్ధి, భూమిలేని పేదలకు పెన్షన్లు, గృహ నిర్మాణం, ఉపాధి కల్పన, ఉచిత విద్య, వైద్యం తదితర చట్టబద్ధమైన హామీలను అన్నింటినీ కచ్చితంగా అమలు చేయాలని కోరారు. అందుకు అవసరమైన నిధులు సమకూర్చుకోవడం, కేంద్రం నుండి రాబట్టడం తదితర విషయాల్లో శ్వేతపత్రాన్ని సమగ్రంగా రూపొందించాల్సిన అవసరం ఉందని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీలుగా రామచంద్రయ్య, హరిప్రసాద్ ఏకగ్రీవం

• ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనమండలిలో శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీలుగా టిడిపి తరపున పోటీ చేసిన సి రామచంద్రయ్య, జనసేన తరపున పోటీ చేసిన పి హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం విజయరాజు శుక్రవారం ప్రకటించారు. ఎమ్మెల్యేల కోటా కింద మండలిలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి నామినేషన్ల ఉపసంహరణ గడువు శుక్రవారంతో ముగియడంతో నామినేషన్లు వేసిన అభ్యర్థులిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.

మేధాపాట్కర్‌కు శిక్షను నిలుపు చేయాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సామాజిక కార్యకర్త, నర్మదా ప్రాజెక్టు బాధితులకు అండగా సుదీర్ఘ కాలం పోరాడిన మేధాపాట్కర్‌కు 23 ఏళ్ల నాటి కేసులో ఢిల్లీ కోర్టు శిక్ష విధించడం సరైంది కాదని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. తక్షణం మేధాపాట్కర్‌కు విధించిన ఐదు నెలల జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానా తీర్పును నిలుపుదల చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి, సీనియర్ నాయకులు వై కేశవరావులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి : ఎంపి పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో :

ప్రకృతిని తల్లిగా భావిస్తున్నందునే 'అమ్మ కోసం మొక్క' అనే పేరుతో జాతీయ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని తీసుకున్నామని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాజమండ్రి ఎంపి, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. విజయవాడలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్థంతి జూన్ 23 నుంచి జులై 6 ఆయన జయంతి వరకు మొక్కలు నాటాలని జాతీయ స్థాయిలో పార్టీ నిర్ణయం తీసుకుందన్నారు.

గత ప్రభుత్వ నిర్వాకంతో రూ.300 కోట్లు అదనపు ఖర్చు

• రాజధాని అమరావతిలో భవనాలను పరిశీలించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

• 9 నెలల్లో నిర్మాణాలను పూర్తి చేయాలని సిఆర్‌డిఎ అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస సముదాయ భవనాలను పూర్తి చేసేందుకు అదనంగా రూ.300 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని శాసనసభ స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. రాజధాని అమరావతి రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సభ్యులందరికీ నివాసాలు కల్పించేందుకు రాయపూడి వద్ద 12 అంతస్తులతో కూడిన 12 టవర్ల నిర్మాణాన్ని 288 ఫ్లాట్లతో గత టిడిపి ప్రభుత్వ హయాంలో చేపట్టగా 2019 నాటికి 77 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. గత వైసిపి ప్రభుత్వం అమరావతి రాజధాని నిర్మాణ పనులను నిలిపివేసి నిర్లక్ష్యం చేయడంతో పనులన్నిటినీ తిరిగి ప్రారంభించి పూర్తి చేసేందుకు అంచనా వ్యయం భారీగా పెరిగిందని, గతంలో పనులు చేసిన కాంట్రాక్టర్లు కూడా ముందుకు రాని పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. గత ఐదేళ్లుగా పనులు నిలిపి వేయడంతో చాలా వరకు నిర్మాణ సామగ్రి తుప్పు పట్టడం, కొంత మెటీరియల్ అపహరణకు గురికావడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని చెప్పారు. రాజధానిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బందికి కల్పిస్తున్న సౌకర్యాలు హైదరాబాదులోనూ లేవని అన్నారు. వీటికి సంబంధించిన ఫినిషింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి తొమ్మిది నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సిఆర్‌డిఎ అధికారులను కోరామని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌డిఎ కమిషనర్ కాటంనేని భాస్కర్, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పిపికె రామాచార్యులు, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, విష్ణు కుమార్ రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాలను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

కర్బన ఉద్గారాలు తగ్గిద్దాం

• ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పర్యావరణ పరిరక్షణ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. పారిశ్రామిక కాలుష్యంపై ప్రజలు ఎదుర్కొంటున్న బాధలు తెలియజేయడం తోపాటు, పరిశ్రమల ప్రతినిధుల సాదకబాధకాలు తెలుసుకునేలా ఈ సమావేశం ఉండాలని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో మంగళగిరిలోని తన నివాసంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పారిశ్రామిక కాలుష్యాలను ఎప్పటి కప్పుడు గుర్తించాలని, ఇందుకు సంబంధించి ఆడిట్ నిర్వహించాలని చెప్పారు. స్వచ్ఛమైన గాలి, నీరు పొందటం ప్రజల హక్కు అని తెలిపారు. పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి విడిచిపెట్టడంతో మత్స్య సంపదకు ముప్పు వాటిల్లుతోందని పేర్కొన్నారు. వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ సంస్థ వ్యర్థ జలాలను పంట కాలువల్లోకి విడిచిపెడుతున్న అంశంపై ఆ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి బి శ్రీధర్, అధికారులు ఎవివి భాస్కరరావు, శ్రీరామ్మూర్తి, పి ప్రసాదరావు, ఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం పెద్ద తలకాయలను పట్టుకోండి

ఎర్ర చందనాన్ని అడ్డగోలుగా నరికేసి జిల్లాలు, రాష్ట్రాలు దాటించి విదేశాలకు అక్రమంగా తరలిస్తున్నవారిని అదుపులోకి తీసుకోవాలని అటవీశాఖ అధికారులను పవన్‌కళ్యాణ్ ఆదేశించారు. కడప జిల్లా పోట్లదుర్తి జగనన్న కాలనీలో ఎర్రచందనం దుంగలు నిల్వ ఉంచిన కేసుపై పవన్‌కళ్యాణ్ స్పందించారు. శేషాచలం అడవుల్లో భారీగా ఎర్రచందనం వృక్షాలను నరికేసారని తెలిపారు. ఆ దుంగలను ఎక్కడెక్కడ దాచారో తక్షణం గుర్తించాలని ఆదేశించారు.

పసుపు ఆధారిత పరిశ్రమల ఏర్పాటు

• పసుపు రైతుల సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పసుపు పండించే అన్ని జిల్లాల్లోనూ పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి పసుపు రైతుల సంఘం విజ్ఞప్తి చేసింది. వడ్డేశ్వరంలోని కెబి భవన్ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం పసుపు రైతుల కమిటీ రాష్ట్ర సదస్సు వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకర్ మాట్లాడుతూ.. 2023లో ప్రధాని మోడీ వాగ్దానం చేసిన విధంగా రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది జనవరి 19న దుగ్గిరాల శుభం మహేశ్వర కోల్డ్ స్టోరేజీలో పసుపు పంట కోల్పోయిన రైతులకు ప్రభుత్వం తక్షణం క్వింటాలుకు రూ.12,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. పసుపు పంట సాగుకు పెట్టుబడులు పెరగడంతో విత్తనం, కౌలు, ఎరువులు, మందులు ఎకరాకు సుమారు రూ.2.50 లక్షలు ఖర్చవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం క్వింటాలు పసుపుకు రూ.16 వేలు మద్దతు ధర నిర్ణయించాల్సిన అవసరం ఉందని అన్నారు. పసుపు పంటకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కౌలు రైతులకు కూడా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ఈ సదస్సులో పసుపు రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు, కో కన్వీనర్ కొండా రామిరెడ్డి, కమిటీ సభ్యులు ములకా శివసాంబిరెడ్డి, ఆంజనేయులు, ఎం శ్రీనివాసరెడ్డి, వై బ్రహ్మేశ్వరరావు, కృష్ణారెడ్డి, అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారమివ్వాలి

ఎపి వ్యకాస, రైతు, కౌలురైతు, గిరిజన సంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం ఇవ్వడంతో పాటు ఉపాధి చూపాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, వి.శివనాగరాణి డిమాండ్ చేశారు. రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక, రైతు, కౌలురైతు, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించిన అనంతరం శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. సిరివాక, గాజులగొంది, కొరుటూరు గ్రామాల నిర్వాసితులకు కేటాయించిన భూములు జల్లేరు రిజర్వాయర్‌లో కలుస్తున్నాయని, పోలవరం నిర్వాసితులు మరోసారి జల్లేరు నిర్వాసితులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 45 కాంటూరులో ఉన్న గ్రామాలను పార్ట్-1 కాంటూరులోకి కుదించారని బోనగిరి, గుంపసవల్లి, దాచవరం, వీరవల్లి, కివ్వాక, కుక్కునూరు, రామచంద్రపురం ప్రజలు కోరుతున్నారని తెలిపారు. పునరావాస గ్రామాల్లో 150 రోజుల నుంచి 200 రోజులకు ఉపాధి హామీ పనులు పెంచాలని కోరారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి వారికి ప్యాకేజీ, పరిహారం, పునరావాసం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ సంఘాల ఆధ్వర్యాన ఐక్యపోరాటాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.జీవరత్నం, పి.రామకృష్ణ, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాఖాహారం మరింత ప్రియం : క్రిసిల్ రిపోర్ట్

న్యూఢిల్లీ: శాఖాహార భోజనం మరింత ఖరీదు అయ్యింది. ఉల్లి, టమోటా, బంగాళ దుంపల రేట్లు పెరిగిపోవడం వల్ల ఈ ఏడాది జూన్‌లో శాఖాహార భోజనం ప్లేట్ 'వెజ్ థాలీ' వ్యయం 10 శాతం పెరిగిందని క్రిసిల్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. మరోవైపు చికెన్ రేట్లు తగ్గడం వల్ల మాంసాహార ప్లేట్ ధర 4 శాతం దిగివచ్చిందని పేర్కొంది. క్రిసిల్ రిపోర్ట్ ప్రకారం.. గతేడాది జూన్‌లో మాంసాహార థాలీ ధర రూ.60.5గా ఉండగా.. గత నెలలో రూ.58కి తగ్గింది. బ్రాయిలర్ చికెన్ ధరలు 14 శాతం క్షీణించడంతో నాన్ వెజ్ థాలీ ధర తగ్గినట్లు నివేదిక తెలిపింది. రోటీ, కూరగాయలు, అన్నం, పప్పు, పెరుగు, సలాడ్‌తో కూడిన వెజ్ థాలీ ధర గడిచిన జూన్ నెలలో రూ.29.4కి పెరిగింది. 2023 ఇదే నెలలో పెరిగిన రూ.26.7తో పోల్చితే ఎక్కువ. గడిచిన జూన్‌లో టమాట ధరలు 30 శాతం, బంగాళదుంపలు 59 శాతం, ఉల్లి ధరలు 46 శాతం పెరగడమే వెజ్‌థాలీ ధర పెరుగుదలకు కారణం.

బొగ్గు మంత్రిత్వ శాఖ
భారత ప్రభుత్వం
నామినేటెడ్ అథారిటీ కార్యాలయం

* నామినేటెడ్ అథారిటీ కార్యాలయం, బొగ్గు మంత్రిత్వశాఖ నిర్దిష్ట మరియు సమయానుకూల ఉద్యోగాలకు హాజరుకావడానికి మంత్రిత్వ శాఖలోని బహిరంగ మార్కెట్ ద్వారా కాంట్రాక్ట్ ప్రాతిపదికన యువ విశ్లేషకులు/నిపుణులను నిమగ్నం చేయాలని ప్రతిపాదించింది. బొగ్గు మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌చేసిన ఖాళీ నోటిఫికేషన్‌లో సూచించిన విధంగా అవసరమైన అర్హతలు మరియు అనుభవం ఉన్న వ్యక్తులు మాత్రమే యువ విశ్లేషకులు/నిపుణులుగా నిమగ్నమై ఉంటారు.
* దరఖాస్తును https://starrating.coal.gov.in/yp_na/ లింక్‌లో ప్రచురించిన విధంగా ఆన్‌లైన్ ఫార్మాట్‌లో సమర్పించాలి.
* షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులకు మాత్రమే సమాచారం ఇవ్వబడుతుంది మరియు ఇంటర్వ్యూలకు పిలుస్తారు.
* అవసరమైన పోస్టులు(ల) కోసం దరఖాస్తు చేయడానికి చివరి తేదీ ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 30 రోజులు.

CBC 04107/12/0002/2425

స్కీమ్ కార్మికులను తొలగించొద్దు : సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో స్కీమ్ కార్మికుల తొలగింపులు ఆపాలని సిఐటియు రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో పరిష్కారం కాని సమస్యలను కొత్త ప్రభుత్వం పరిష్కరిస్తుందని అంగన్‌వాడీలు, ఆశా, మధ్యాహ్న భోజనం తదితర స్కీమ్ కార్మికులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంలోకి వచ్చిన పార్టీ కింది స్థాయి నాయకులు స్థానికంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను పని మానేయాలని బెదిరిస్తున్నారని, తద్వారా వారి మనుషులను పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో ఒక అంగన్‌వాడీ వర్కర్ ఈ ఒత్తిడి తట్టుకోలేక ఆస్పత్రిలో చేరాల్సి వచ్చిందని వివరించారు. ఇదే జిల్లాలో మరో రెండు చోట్ల హెల్పర్లను బయటకు పంపి తమ వారిని పనిలో పెట్టుకోవాలని ఆదేశాలు ఇస్తున్నారని తెలిపారు. అనంతపురం జిల్లా వజ్రకరూరులో కూడా మధ్యాహ్న భోజన కార్మికురాలిపై స్థానిక అధికార పార్టీ నాయకులు దాడి చేశారని వివరించారు. ఆ ఒత్తిడి తట్టుకోలేక పురుగుమందు తాగి ఆమె చావుబతుకుల్లో ఉందని తెలిపారు. ఇతర కార్మికులపై కూడా ఒత్తిడి వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీలు మారినప్పుడల్లా కొత్తగా ప్రభుత్వంలోకి వచ్చినవారు స్కీమ్ వర్కర్లపై దాడి చేయడం ఒక రివాజుగా మారిందని విమర్శించారు. వర్కర్ల పని పరిస్థితులకు సంబంధించి కొన్ని విధి విధానాలున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అధికార పార్టీ వారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగుల స్థానికత సమస్య పరిష్కరించండి : సిఐటియు

రాష్ట్ర విభజన అనంతరం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న స్థానికత సమస్యకు పరిష్కారం చూపాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి సమావేశం వున్నందున రెండు రాష్ట్రాల్లోని ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. విభజన జరిగి పదేళ్లు దాటినా ఇప్పటికీ చాలామంది తెలంగాణ ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్‌లో, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులు తెలంగాణలో విధులను నిర్వహిస్తున్నారని తెలిపారు. సొంత రాష్ట్రాలకు వెళ్లాలనుకున్నవారు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్ని పర్యాయాలు వినతులిచ్చినా పరిష్కారం చూపలేదని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగే సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెఎసి నాయకులు

'కార్మిక' సంక్షేమ పథకాలు అమలు చేయాలి

• ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కార్మిక సంక్షేమ బోర్డు నుంచి వర్తించే సంక్షేమ పథకాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వర్కర్ల జెఎసి కోరింది. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను సచివాలయంలో జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అందరికీ కనీస వేతనాలు (మినిమం టైంస్కేల్) వర్తింపజేయాలని సంబంధిత అధికారులకు తగు సిఫార్సులు చేయాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు, గ్రాట్యూటీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో కోశాధికారి డి దయామణి, కార్యదర్శి జె సింహాచలం, బి విజయ్, చాందిని పఠాన్, అనురాధ, బేబిరాణి పాల్గొన్నారు.

ADITYA BIRLA CAPITAL
PROTECTING INVESTING FINANCING ADVISING
ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డు ఆఫీసు: ఇండియన్ రాయన్ కాంపౌండు వెరవల్, గుజరాత్-362266.
బ్రాంచి ఆఫీసు: 3వ అంతస్తు, 40-1-52సి. కానూరు కన్‌స్ట్రక్షన్స్ & లీజింగ్, ఎంజి రోడ్, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ, ఆం.ప్ర.-520010.

అమ్మకపు ప్రకటన
సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9(1)

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు చార్జ్‌చేయబడిన స్థిరాస్తి ప్రైవేట్ ట్రీటీ ద్వారా అమ్మకం. ("సార్ఫసీ యాక్ట్")

దిగువ సంతకందారు ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇందు తదుపరి "ఎబిహెచ్ఎఫ్ఎల్"గా పేర్కొనబడును) యొక్క అధీకృత అధికారిగా, ఏదైతే ఆర్థిక సహాయంకుగాను ఎబిహెచ్ఎఫ్ఎల్ పేరులో హామీగా పెట్టి ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (ఇందు తదుపరి "సార్ఫసీ యాక్ట్, 2002గా పేర్కొనబడును) యొక్క సెక్షన్ 13(4) క్రింద, **కృష్ణా జిల్లా, మైలవరం సబ్-రిజిస్ట్రీ, మైలవరం గ్రామం, గ్రామపంచాయతి & మండలం వద్దగల ఆర్.ఎస్.నం.166/1, డోర్ నం.8-97, అసెస్మెంట్ నం.1500లో దానిపై ఆర్‌సిసి రూఫ్ నిర్మాణాలతో 197చ.గ.ల విస్తీర్ణపు సైటు"** గా స్థిరాస్తిని భౌతికంగా స్వాధీనంచేసుకున్నారు. దాని బకాయి **12.05.2021 నాటికి రూ. 41,01,377.14 పై.లు (రూపాయలు నలభై ఒక లక్షల ఒక వెయ్యి మూడు వందల డెబ్బై ఏడు మరియు పద్నాలుగు పైసలు మాత్రమే)** మరియు తదుపరి వడ్డీ మరియు రియలైజేషన్ తేదీ వరకు దానిపై వెచ్చించిన ఇతర వ్యయాలుతో రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు **శ్రీ రామకృష్ణ కుతాడ మరియు శ్రీమతి సుజాతా కుతాడ (ఇందు తదుపరి "రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు"గా పేర్కొనబడుతుంది). సరిహద్దులు: ఉత్తరం: వేముల నరసయ్య సైటు, దక్షిణం: పోరంబోకు (కాలువ), తూర్పు: వేముల నాగేశ్వర రావు సైటు, పడమర: పంచాయతి బజార్ (ఇందు తదుపరి "సెక్యూర్డ్ అసెట్"గా పేర్కొనబడుతుంది)**
సెక్యూర్డ్ అసెట్ యొక్క బహిరంగ వేలంలు/ ఇ-వేలంలు విఫలమైన దృష్ట్యా, క్రింది సంతకందారు సార్ఫసీ యాక్ట్, 2002 యొక్క నియమలు మరియు దాని క్రింద రూపొందించిన రూల్స్ క్రింద ప్రైవేట్ ట్రీటీ ద్వారా అమ్మకం రూపం ద్వారా సదరు సెక్యూర్డ్ అసెట్ పై దీని సెక్యూరిటీ ఇంటెరెస్ట్ ఎన్ఫోర్స్‌చేయదలచారు. అధీకృత అధికారి సదరు ఒక కొనుగోలుదారు నుండి పై పేర్కొన్న ఆస్తిని కొనుగోలుచేయుటలో ఆసక్తి వ్యక్తపరుచు ప్రతిపాదనను స్వీకరించారు.
ఇప్పుడు అధీకృత అధికారి, ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8&9 యొక్క నియమాలలో ప్రైవేట్ ట్రీటీ ద్వారా పై సదరు సెక్యూర్డ్ అసెట్‌ను విక్రయించుటకు ఇందుమూలంగా ప్రకటన ఇవ్వదలచారు. రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతల నుండి ఎబిహెచ్ఎఫ్ఎల్‌కు బాకయిగా **12.05.2021 నాటికి రూ. 41,01,377.14 పై.లు (రూపాయలు నలభై ఒక లక్షల ఒక వెయ్యి మూడు వందల డెబ్బై ఏడు మరియు పద్నాలుగు పైసలు మాత్రమే)** లను రికవరీచేయుట కొరకు **26.07.2024 న లేదా తరువాత "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన అమ్మబడుతుంది. సెక్యూర్డ్ అసెట్ యొక్క రిజర్వు ధర **రూ.18,00,000/- (రూపాయలు పద్దెనిమిది లక్షలు మాత్రమే)**గా నిర్ణయించారు.
రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలుకు ఇందుమూలంగా తెలియజేయబడునది ఏమనగా, సార్ఫసీ యాక్ట్, 2002 మరియు ది సెక్యూరిటీ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క నియమాల క్రింద అభ్యర్ధనలన్నింటిని ఆమోదించుతూ, మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(5) యొక్క నియమాల క్రింద సిఫారసుచేసినట్లుగా ప్రైవేట్ ట్రీటీ రూపంలో ఇందు పేర్కొన్నట్లు సెక్యూర్డ్ అసెట్ అమ్మకంకు సంబంధించి దీని సెక్యూరిటీ ఇంటెరెస్ట్‌ను ఎన్‌ఫోర్సింగ్ ప్రక్రియ క్రింద ఎబిహెచ్ఎఫ్ఎల్ ఉంది.
తదుపరి రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు సదరు సెక్యూర్డ్ అసెట్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, సార్ఫసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

ప్రదేశం: విజయవాడ
తేది: 06.07.2024
సం/- అధీకృత అధికారి,
ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

సీనియర్ జర్నలిస్టు ఉపేంద్ర బాబు మృతి

ప్రజాశక్తి - కంకిపాడు

సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి పూర్వ డిప్యూటీ ఎడిటర్ గారపాటి ఉపేంద్ర బాబు (89) శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియలు విజయవాడ స్వర్గపురిలో ముగిశాయి. 1935 డిసెంబరు 9న కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కాసరనేనివారిపాలెంలో జన్మించారు. సుదీర్ఘ కాలం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వివిధ హోదాల్లో పనిచేశారు. 1961లో సబ్‌ఎడిటర్‌గా జర్నలిస్టు ప్రస్థానాన్ని ప్రారంభించి డిప్యూటీ ఎడిటర్ హోదాలో ఉద్యోగ విరమణ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన జర్నలిస్టు ఉద్యమాల్లో కీలక భూమిక పోషించారు. 1976,78 కాలంలో రెండుసార్లు ఎపియుడబ్ల్యుజె ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. యూనియన్ కార్యకలాపాలలో చురుకైన నాయకుడిగా ఉన్నారు. స్నేహశీలి, జర్నలిస్టుల శ్రేయోభిలాషిగా పలువురి మన్ననలు పొందారు. ఉపేంద్ర బాబు భౌతికయాన్ని ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపియుడబ్ల్యుజె నాయకులు సందర్శించి, నివాళులర్పించారు.

ఉపేంద్ర బాబు (పాత చిత్రం)

మండల సమావేశానికి వెళ్లకుండా జడ్‌పి ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే అడ్డగింత

• గేటు వద్దే ఆపేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-దొనకొండ (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా దొనకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి వచ్చిన జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిలని ఎంపిడిఒ కార్యాలయం గేటు వద్ద టిడిపి నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. గేటును మూసివేసి 'గోబ్యాక్' అంటూ నినాదాలు చేశారు. ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ లోపలికి వచ్చే సమయంలో గేట్లు మూసివేయడంతో ఆమెతో పాటు ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి కూడా గేటు బయటే ఉండిపోయారు. దీంతో వైసిపి కార్యకర్తలు పెద్దఎత్తున ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకుని బూచేపల్లికి మద్దతుగా నినాదాలు చేశారు. జడ్‌పి నిధుల్లో అక్రమాలు జరిగాయని, బిల్లులు రాలేదని ఆరోపణలు చేస్తూ టిడిపి కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చే యత్నం చేశారు. గంటసేపు రాజకీయ హైడ్రామా నడిచింది. టిడిపి కార్యకర్తలకు పోలీసులు సర్దిచెప్పి గేట్లు తీయించి ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యేను లోపలకి తీసుకుపోయారు. రిజిస్టర్‌లో సంతకాలు చేసిన అనంతరం వారు వెళ్లిపోయారు.

అందుబాటులోకి ఇన్వెస్టిమెంటు పోర్టల్

• ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖ మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడుల పర్యవేక్షణకు గతంలో ఉన్న పోర్టల్‌ను మరింత మెరుగ్గా తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖ మంత్రి లోకేష్ ఆదేశించారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల ప్రస్తుత స్థితి, కొత్త పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలపై ఉండవల్లిలోని తన నివాసంలో లోకేష్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు కొత్తగా వచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొత్త పరిశ్రమలను ఆకర్షించడానికి మెరుగైన విధానాలతో నూతన ఐటి పాలసీని తీసుకురానున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో ఐటి పరిశ్రమల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న ప్లగ్ అండ్ ప్లే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై నివేదిక ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖ కార్యదర్శి కోన శశిధర్, జెడి సూర్జిత్ సింగ్, ఎపి ఇన్నొవేషన్ సొసైటీ సిఇఒ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుడు.. ప్రతి నాయకుడు అంటూ ట్వీట్

నాయకుడు.. ప్రతినాయకుడు అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీరును పోలుస్తూ లోకేష్ శుక్రవారం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. సిఎంగా చంద్రబాబు తొలి ఢిల్లీ పర్యటనలో రాష్ట్ర మంత్రులు, ఎంపిలతో కలిసి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై ప్రధాని మంత్రిని కలిసి నిర్దిష్టంగా రాష్ట్ర తక్షణ అవసరాలపై వినతిపత్రం అందించారని తెలిపారు. ఎన్నికల ఫలితాల తరువాత ప్రతి నాయకుడి తొలి జిల్లా పర్యటన నెల్లూరు జిల్లా జైలు అని పేర్కొన్నారు. అక్రమాలు, అరాచకాలలో ఆరితేరి, పల్నాడును రావణకాష్టం చేసి చివరకు జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ అని వివరించారు.

పోలీసుల కస్టడీకి పిన్నెల్లి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నెల్లూరు జైలులో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డిని పోలీసులు విచారించేందుకు మాచర్ల కోర్టు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. నెల్లూరు జైలులోనే విచారణకు కోర్టు అనుమతి ఇచ్చింది. రెండు రోజుల పాటు పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించనున్నారు.

తిరుమలలో పెరిగిన రద్దీ

ప్రజాశక్తి- తిరుమల:

తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు సందర్శకులతో నిండిపోయాయి. బయట ఎటిసి వరకూ క్యూ లైన్లలో సందర్శకులు ఉన్నారు. వారికి శ్రీవారి సేవకులు ఉచిత ప్రసాదాన్ని, మంచినీరు అందిస్తున్నారు. గురువారం తిరుమల శ్రీవారిని 63,826 మంది దర్శించుకున్నారని, వీరిలో 27,530 మంది తలనీలాలు సమర్పించారని, శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు వచ్చిందని టిటిడి అధికారులు తెలిపారు.

'హోదా'ను విస్మరించడం తగదు

• వైసిపి మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని వైసిపి మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు చెప్పారు. ఢిల్లీకి వెళ్లిన చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ప్రత్యేక హోదాను ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు రోజులపాటు ఢిల్లీలో వున్న చంద్రబాబు.. ప్రధాన మంత్రి, ఇతర కేంద్ర మంత్రులను కలవడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే రెండు రోజులు వుండి రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించడం తగదని పేర్కొన్నారు. ఎన్‌డిఎలోని మిత్రపక్షమైన జెడియు అధినేత బీహార్‌కు ప్రత్యేక హోదాను డిమాండ్ చేసినట్లు, రాష్ట్రానికి చంద్రబాబు ప్రత్యేక హోదా ఎందుకు అడగలేకపోయారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎర్ర చందనంపై వాస్తవాలను మాట్లాడాలి : నాగార్జున యాదవ్

ఎర్ర చందనంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని వైసిపి అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ అన్నారు. జగన్ కంటే ముందు రాష్ట్రాన్ని పాలించింది చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి అనే అంశాన్ని పవన్‌కల్యాణ్ విస్మరించారని అన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డిని అనవసరంగా ఎర్రచందనం వివాదంలోకి లాగడం సరైంది కాదన్నారు.

यूनियन बैंक ऑफ़ इंडिया
यूनियन బ్యాంక్ ఆఫ్ ఇండియా
भारत सरकार का उपक्रम భారత ప్రభుత్వ రంగ సంస్థ
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం, ఎ.పి. ఫోన్: 0891-2537792. ఇ-మెయిల్: ubin0817295@unionbankofindia.bank

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 6(2)/8(6) క్రింద అమ్మకం గురించి (30 రోజుల నోటీసు) తెలియచేస్తూ ఋణగ్రహీతకు నోటీసు

టు:
(1) మెస్సర్స్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఏజెన్సీస్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: కొమ్మనబోయిన వినోద్ కుమార్, తండ్రి: కొమ్మనబోయిన కాళేశ్వరరావు, డి.నెం. 28-1-1/105, 3వ రోడ్డు, శాంతి నగర్, ఏలూరు-534004, **(2) శ్రీ కిరణ్ పెన్నేరు, తండ్రి: పి. నరసింహారావు,** #10052, ప్రెస్టీజ్ ట్రాంక్విలి, బుధిగర్ క్రాస్, బెంగుళూరు-560049, కర్ణాటక, **(3) శ్రీమతి కొమ్మనబోయిన గిరి రాజకుమారి, భర్త: కొమ్మనబోయిన కాళేశ్వరరావు,** హెచ్.నెం. 28-1-1/105, 3వ రోడ్డు, శాంతి నగర్, ఏలూరు-534004, పశ్చిమ గోదావరి జిల్లా, **(4) శ్రీ కొమ్మనబోయిన మధు నవీన్, తండ్రి: కొమ్మనబోయిన కాళేశ్వరరావు,** హెచ్.నెం. 28-1-1/105, 3వ రోడ్డు, శాంతి నగర్, ఏలూరు-534004, పశ్చిమ గోదావరి జిల్లా, **(5) కొమ్మనబోయిన కాళేశ్వరరావు, తండ్రి: నాంచారయ్య,** శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఏజెన్సీస్, శాంతినగర్ లేన్, ఏలూరు, **(6) శ్రీ పెన్నేరు నరసింహరావు, తండ్రి: నాంచారయ్య,** డి.నెం. 5-186, దుర్గానగర్, కానూరు, విజయవాడ-520007, కృష్ణా జిల్లా, **(7) శ్రీ పెన్నేరు రేవతి, భర్త: కిరణ్ పెన్నేరు,** #10052, ప్రెస్టీజ్ ట్రాంక్విలి, బుధిగర్ క్రాస్, బెంగుళూరు-560049, కర్ణాటక.
డియర్ సార్/మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలిసిన బకాయి వసూలు కొరకు మెస్సర్స్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఏజెన్సీస్ ఋణగ్రహీతలు/హామీదారులకు చెందిన ఆస్తులు అమ్మకం.
బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తములను నోటీసులో తెలిపిన నిర్ణీతకాలంలోగా చెల్లించవలసినదిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం-530001** సెక్యూర్డ్ క్రెడిటార్ వారు మీకు డిమాండ్ నోటీసు తేది **01-11-2019**న జారీచేసినారు. అయినప్పటికీ మీరు సదరు నోటీసులో సూచించిన నిర్ణీత కాలంలోగా బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 8వ రూలుతో కూడిన సదరు చట్టం 13(4) సెక్షన్ క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను అధీకృత అధికారి గారు ఆస్తిని తేది **08-01-2020** న స్వాధీన పరుచుకున్నారు.
సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీన పరచుకున్న తరువాత కూడా మీరు బ్యాంకు యొక్క బకాయి మొత్తము చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 30 రోజులు తరువాత బహిరంగ ఇ-వేలం నిర్వహించుట ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించవలసిన అవసరం ఉంటుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం నిర్వహించు సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియజేయబడతాయి. కాబట్టి, అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా మీరు బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తముతో పాటు దానిపై తదుపరి వడ్డీ, బ్యాంకు వారికి సంభవించిన ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలు చెల్లించినచో, అస్తి అమ్మకంపైన తదుపరి చర్యలు చేపట్టబడవు మరియు సదరు చట్టం 13(8) సెక్షన్ పరిధిలో మీ తనఖా ఆస్తులను మీరు విడిపించుకోవచ్చును.

షెడ్యూలు ఆస్తుల వివరములు

ఐటమ్ నెం-1: ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం మరియు గ్రామపంచాయితీ, హనుమాన్ జంక్షన్, ఆర్ఎస్ నెం. 195/1బి, పెన్నేరు కిరణ్ మరియు పెన్నేరు రేవతి పేరునగల సుమారుగా 9176.58 చ॥అ॥ అర్బన్ ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: మచిలీపట్నం నుండి కల్లూరు పోవు రోడ్డు, పడమర: నూకల అన్నపూర్ణమ్మ మరియు ఇతరుల స్థలం, ఉత్తరం: కామినేని కుటుంబ రావు స్థలం, దక్షిణం: అరిగే ప్రభాకర్ 'ఎ' షెడ్యూల్ ఆస్తి స్థలం. **ఐటమ్ నెం-2:** ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం మరియు గ్రామపంచాయితీ, హనుమాన్ జంక్షన్, ఆర్ఎస్ నెం. 195/1బి, కొమ్మనబోయిన వినోద్ కుమార్ మరియు కొమ్మనబోయిన మధు నవీన్ పేరునగల సుమారుగా 9176.58 చ॥అ॥ అర్బన్ ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: మచిలీపట్నం నుండి కల్లూరు పోవు రోడ్డు, పడమర: నూకల అన్నపూర్ణమ్మ మరియు ఇతరుల స్థలం, ఉత్తరం: అరిగే ప్రభాకర్ 'ఎ' షెడ్యూల్ ఆస్తి స్థలం, దక్షిణం: బండి వారి ట్యాంక్ బండ్. **ఐటమ్ నెం-3:** ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం మరియు గ్రామపంచాయితీ, హనుమాన్ జంక్షన్, ఆర్ఎస్ నెం. 195/1బి, కొమ్మనబోయిన మధు నవీన్ పేరునగల సుమారుగా 4588.30 చ॥అ॥ అర్బన్ ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: మచిలీపట్నం నుండి కల్లూరు పోవు రోడ్డు, పడమర: నూకల అన్నపూర్ణమ్మ మరియు ఇతరుల స్థలం, ఉత్తరం: దేవరకొండ భవాని స్థలం, దక్షిణం: కొమ్మనబోయిన వినోద్ కుమార్ మరియు కొమ్మనబోయిన మధు నవీన్ యొక స్థలం. **ఐటమ్ నెం-4:** ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం మరియు గ్రామపంచాయితీ, హనుమాన్ జంక్షన్, ఆర్ఎస్ నెం. 195/1బి, కొమ్మనబోయిన వినోద్ కుమార్ పేరునగల సుమారుగా 4588.30 చ॥అ॥ అర్బన్ ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: మచిలీపట్నం నుండి కల్లూరు పోవు రోడ్డు, పడమర: నూకల అన్నపూర్ణమ్మ మరియు ఇతరుల స్థలం, ఉత్తరం: పెన్నేరు కిరణ్ మరియు రేవతి యొక్క స్థలం, దక్షిణం: కొమ్మనబోయిన మధు నవీన్ స్థలం.

తేది: 25.06.2024,
స్థలం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి & అసిస్టెంట్ జనరల్ మేనేజర్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచ్

సంపాదకీయం

ఉపాధి కరువు

దేశంలో ఈ ఏడాది జూన్‌లో నిరుద్యోగిత రేటు 9.2 శాతానికి ఎగిసి... ఎనిమిది నెలల గరిష్ట స్థాయిలో నమోదయ్యిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) గురువారం వెల్లడించిన రిపోర్టు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మే నెలలో నిరుద్యోగ స్థాయి రేటు ఏడు శాతంగా ఉండగా ఒక్క నెలలోనే అదనంగా 2.2 శాతం పెరిగిపోవడం ఆర్థిక వ్యవస్థ మందగమనానికి నిదర్శనం. దేశ ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని మోడీ సర్కార్ చేస్తున్న ప్రచారం ఎంత బూటకమో ఉపాధి కల్పన గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. సిఎంఐఇ రిపోర్ట్ ప్రకారం...2023 జూన్‌లో నమోదయిన 8.5 శాతం నిరుద్యోగితతో పోల్చినా గడిచిన నెలలో ఈ రేటు మరింత పెరిగింది (ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న వారి సంఖ్య ఆధారంగా ఈ రేటును రూపొందిస్తారు.). నిరుద్యోగుల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారని, పట్టణాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ స్థాయి అధికంగా ఉన్నట్లు రిపోర్ట్ వెల్లడించింది. గతేడాది జూన్‌లో మహిళల్లో నిరుద్యోగం 15.1 శాతంగా ఉండగా ఈ ఏడాది జూన్‌లో 18.5 శాతానికి ఎగిసింది. పురుషుల్లో నిరుద్యోగం 7.7 శాతం నుంచి 7.8 శాతానికి చేరింది. గ్రామాల్లో 2024 మేలో 6.3 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు జూన్ నాటికి 9.3 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో మే లో 8.6 శాతంగా ఉన్న స్థూల నిరుద్యోగిత రేటు.. జూన్‌లో 8.9 శాతానికి పెరిగింది. పెరుగుతున్న ధరలతో దేశీయంగా డిమాండ్ మందగించడంతో ఆర్థిక వ్యవస్థ రికవరీ నెమ్మదించడం వలన ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయన్నది నిపుణుల మాట. ఎకనామిక్ టైమ్స్ ఇటీవల చేసిన ఒక సర్వేలోనూ నిరుద్యోగం ప్రధాన సవాలు అని ఆందోళన వ్యక్తమయింది. దేశంలో నిరుద్యోగం ప్రమాదకర స్థాయికి చేరిందని ప్రభుత్వ మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు కౌశిక్ బసు కూడా గత నెలలో ఆందోళన వ్యక్తం చేశారు.

దేశంలో పరిస్థితి అలా ఉండగా రాష్ట్రంలో ఉపాధి కల్పన, జీవన ప్రమాణాల పెంపునకు సంబంధించి ప్రణాళికా శాఖ రూపొందించిన నివేదిక ప్రకారం అత్యధికులు ఏ మాత్రం భద్రత లేని ఉపాధిని పొందుతూ చాలీచాలని జీతాలతో నానా అవస్థలు పడుతున్నారు. త్వరలో జరగనున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల కోసం ప్రణాళికాశాఖ రూపొందిస్తున్న ఈ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 19 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉన్న వారిలో 31.6 శాతం మంది దినసరి కూలీలుగానే బతుకు వెళ్లదీస్తున్నారు. మరో 43 శాతం మంది వరకు సొంతంగా ఉపాధి అవకాశాలు వెదుక్కోగా, 25.4 శాతం మంది మాత్రమే రెగ్యులర్ వేతనాలు అందుకుంటున్నారని తేలింది. గ్రామాల్లో 39 శాతం మంది కూలీలుగా ఉండగా, పట్టణాల్లో 15 శాతం మంది ఉన్నట్లు గుర్తించారు. నెలవారీ జీతాలు, వేతనాలు తీసుకుంటున్న వారిలో 47.4 శాతం మంది పట్టణాల్లో ఉండగా, 15.5 శాతం మంది మాత్రమే గ్రామాల్లో ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్రంలో 15 నుంచి 29 సంవత్సరాల మధ్య యువతలో నిరుద్యోగం ఎక్కువగా ఉండడం ఆందోళనకరం. ఈ విభాగంలో 17.3 శాతం మంది పురుషులు, 11.1 శాతం మంది మహిళలు నిరుద్యోగులుగా ఉన్నట్లు గుర్తించారు. ఇందులో పట్టణ ప్రాంతాల్లో మహిళలు 26.1 శాతం నిరుద్యోగులు కాగా గ్రామీణ ప్రాంతాల్లో 5.6 శాతంగా ఉన్నట్లు గుర్తించారు.

సార్వత్రిక ఎన్నికల్లో ధరల పెరుగుదల, నిరుద్యోగం ప్రధాన సమస్యలుగా ముందుకొచ్చాయనీ, గ్రామీణ ప్రజలు వీటిపై ఎక్కువగా స్పందించారనీ సిఎస్‌డిఎస్-లోక్‌నీతి వంటి సర్వేలు పేర్కొన్నాయి. ఈ నివేదికల సారాంశం కూడా అదే కావడం గమనార్హం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా ఉపాధి కల్పనకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలి. బడ్జెట్ రూపకల్పనలో అందుకు పెద్దపీట వేయాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకాల్లో ఒకటి నైపుణ్య సర్వేకు సంబంధించినది కావడం స్వాగతించదగినది. ఆ కృషి పూర్తి స్థాయిలో ఆచరణ రూపం దాల్చి, నిరుద్యోగులకు వారి నైపుణ్యాలకు తగినవిధంగా ఉపాధి కల్పించడంపై సర్కారు కేంద్రీకరించాలి. కానీ కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారు మాత్రం ఆ దిశగా యోచించకుండా గత పదేళ్ల విధ్వంసకర విధానాలనే మరింత వేగంగా కొనసాగించజూస్తోంది. ప్రమాదకరమైన ఈ ధోరణిని ప్రజలు గమనించి మోడీ ప్రభుత్వం తగు చర్యలు చేపట్టేలా ఒత్తిడి తేవాలి.

మంచి మాట

నిజమైన నేతలు
తమ ప్రజల స్వేచ్ఛ కోసం
అన్నింటినీ త్యాగం చేయడానికి
సిద్ధపడాలి.
- నెల్సన్ మండేలా

నూతన నేర చట్టాలు నిలిపివేయాలి

వ్యాఖ్య

గత లోక్‌సభ చిట్టచివరి సమావేశాలలో అత్యంత నిర్లక్ష్యంగా అప్రజాస్వామిక పద్ధతిలో ఆమోదించిన మూడు నూతన చట్టాలు జులై 1 నుంచి దేశమంతటా అమలులోకి వచ్చేలా బిజెపి గట్టి చర్యలు తీసుకున్నది. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ అనే మూడు గత చట్టాల స్థానాన్ని భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినయం అనే ఈ మూడు చట్టాలు ఆక్రమించాయి. ఎలాంటి సన్నాహాలు, చర్చ, వాదనలు లేకుండానే మొత్తం న్యాయ వ్యవస్థ ప్రధాన మార్పులకు లోనుకావడం చూస్తే బుర్ర తిరిగే వ్యవహారం తప్ప మరొకటి కాదు. బిజెపి పని తీరు పైన విధానాల పైన ఓటర్లు తీర్పు ఇచ్చిన తర్వాత, పార్లమెంటులో మెజార్టీ రాకుండా పోయిన తర్వాత కూడా ఆ పార్టీలో ఏ మార్పు లేదని దీన్నిబట్టి స్పష్టమవుతుంది. హిందీలో మాత్రమే నామకరణం చేయబడిన ఈ మూడు చట్టాలపై లోక్‌సభలో లోతైన చర్చ జరిగిందే లేదు. ఏదో మొక్కుబడి కోసం వాటిని సెలెక్ట్ కమిటీకి పంపి సభ ముందు పెట్టి క్షణాల మీద ఆమోదించేశారు. అసలు ఆ సమయంలో సభలో ప్రతిపక్ష సభ్యులు వుండే అవకాశమే లేకుండా చేయబడింది. ఎందుకంటే వారిలో 148 మందిని సస్పెండ్ చేసినందున సభలో పాల్గొనే అవకాశం లేదు. న్యాయవ్యవస్థ అన్ని స్థాయిల్లోనూ వుండే న్యాయవాద బృందాలు, సభ్యులు, ఆఖరుకు పోలీసులు కూడా ఈ కొత్త చట్టాలను గురించి పెద్దగా తెలియలేదు. అందువల్ల వాటి అమలు సహజంగానే వాటికి ఏ విధమైన వ్యాఖ్యానమివ్వాలి, అమలు చేయాలి అనే తీవ్రమైన సమస్యలు తెచ్చిపెడుతుంది. ఈ చట్టాలను అమలులోకి తేవడంతో పాటు దానికి సమాంతరంగా మరో నేర న్యాయవ్యవస్థ కూడా ఉనికిలోకి వస్తుంది. ఏమంటే జులై ఒకటవ తేదీకి ముందు ఏదైనా నేరం చేసిన ఒక వ్యక్తికి అప్పుడున్న విస్తారమైన నేర చట్టాల ప్రకారమే విచారించవలసి వుంటుంది. అదే నేరం గనక జులై 1 తర్వాత జరిగినట్టయితే ఈ సరికొత్త విస్తారమైన చట్టాల మేరకు విచారించవలసి వస్తుంది. అంటే దీని అర్థం ఏమంటే ఒక సమాంతర న్యాయవ్యవస్థ ఏర్పరచడం, ఒకే సమయంలో రెండు రకాల చట్టాలు అమలులోకి రావడం జరుగుతుందన్నమాట. దాంతో ఏ చట్టాన్ని వర్తింపచేయాలనే వివాదం రావడం సహజంగా జరుగుతుంది. ఉదాహరణకు జులై ఒకటవ తేదీ ముందు ఎఫ్‌ఐఆర్‌లో నేరారోపణకు గురైన వారు తమను పాత చట్టాల ప్రకారం విచారించాలిన కోరవచ్చు. కానీ ప్రాసిక్యూషన్ వారిని కొత్త చట్టాల ప్రకారం విచారణకు పెట్టడానికి ప్రయత్నించవచ్చు.వాజ్యాలు కూడా చాలా సంక్లిష్టంగా మారిపోతాయి.

మరో యాభై ఏళ్లు అస్పష్టత

చట్టాలకు సుప్రీం కోర్టు భాష్యం చెబుతూ వచ్చింది. సిఆర్‌పిసికి 1973లో చేసిన సవరణలు ఇప్పుడే కొంత నిశ్చిత రూపం సంతరించుకున్నాయి. ఈ కొత్త చట్టాలకు ఆ విధమైన స్థిరత్వం రావాలంటే మరో యాభై ఏళ్లు పడుతుంది. దేశంలోని వేలాది మంది మేజిస్ట్రేట్లు ఈ కొత్త చట్టాలకు వేర్వేరు పద్ధతుల్లో తమవైన వ్యాఖ్యానాలు చేసినప్పుడు ఏది నిలబడుతుందో ఊహించుకోవచ్చు. ఈ రకరకాల వ్యాఖ్యానాలు, ఆలస్యాల వల్ల నిందితులు విపరీతమైన సమస్యలకు గురవడం తథ్యం. ఆ నిందితులు గనక కస్టడీలో వుండేట్టయితే అతడు లేక ఆమె సమస్యలు మరింత జటిలంగా పరిణమిస్తాయి. చట్టం నిర్దేశించే పద్ధతి వల్ల తప్ప మరే విధంగానూ ఒక పౌరుడి ప్రాణాలకు, స్వేచ్ఛకు ఆటంకం రాకూడదని 21వ అధికరణం హామీనిస్తుంది. కాని ఇక్కడ అసలు చట్టం ఏమిటి అన్నదే వివాదమైనప్పుడు దాన్ని అమలు చేయడం కూడా కష్టతరమవుతుంది. ఈ కొత్త చట్టాలు ఏం చెబుతున్నాయనే దానిపైనే అనిశ్చితిని, అస్పష్టతను తెచ్చిపెడతాయి. ఈ నూతన చట్టాలు వచ్చిన తర్వాత నేర కేసులు 30 శాతం ఎక్కువగా జాప్యం జరుగుతుందని సీనియర్ లాయర్లు చెబుతున్నారు. వేల మందికి, ప్రత్యేకంగా వనరులు లేని వారికి న్యాయం నిరాకరించబడటానికి ఇది దారి తీస్తుంది. అసలు కేసుల పెండింగుపై దీని ప్రభావం ఏమిటనేది లెక్క కట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించిన దాఖలాలే కనిపించవు. ఎందుకంటే దాన్ని సర్కారు ఖాతరు చేయదల్చుకోలేదు. అనువాదం చేయడానికి, అమలు చేయడానికి సంబంధించిన సమస్యలు ఎలాగూ తప్పవు గనక అనివార్య చిక్కులుగా వదిలేయవచ్చు. కాని ఈ నూతన చట్టాలలో కొన్ని సెక్షన్లు అత్యంత నిరంకుశమైనవి, మరికొన్ని సెక్షన్లు న్యాయం అందించడంలో అవరోధాలు సృష్టించేవిగా వున్నాయి.

ఇక్కడ అసలు చట్టం ఏమిటి అన్నదే వివాదమైనప్పుడు దాన్ని అమలు చేయడం కూడా కష్టతరమవుతుంది. ఈ కొత్త చట్టాలు ఏం చెబుతున్నాయనే దానిపైనే అనిశ్చితిని, అస్పష్టతను తెచ్చిపెడతాయి. ఈ నూతన చట్టాలు వచ్చిన తర్వాత నేర కేసులు 30 శాతం ఎక్కువగా జాప్యం జరుగుతుందని సీనియర్ లాయర్లు చెబుతున్నారు. వేల మందికి, ప్రత్యేకంగా వనరులు లేని వారికి న్యాయం నిరాకరించబడటానికి ఇది దారి తీస్తుంది. అసలు కేసుల పెండింగుపై దీని ప్రభావం ఏమిటనేది లెక్క కట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించిన దాఖలాలే కనిపించవు. ఎందుకంటే దాన్ని సర్కారు ఖాతరు చేయదల్చుకోలేదు. అనువాదం చేయడానికి, అమలు చేయడానికి సంబంధించిన సమస్యలు ఎలాగూ తప్పవు గనక అనివార్య చిక్కులుగా వదిలేయవచ్చు. కాని ఈ నూతన చట్టాలలో కొన్ని సెక్షన్లు అత్యంత నిరంకుశమైనవి, మరికొన్ని సెక్షన్లు న్యాయం అందించడంలో అవరోధాలు సృష్టించేవిగా వున్నాయి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

పోలీసులకు నిరంకుశాధికారాలు

న్యాయాన్ని చేరుకోవడంలో మొదటి అడుగు ఎఫ్‌ఐఆర్. ఈ కొత్త చట్టాల కింద మూడు నుంచి ఏడేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశమున్న ఏదైనా నేరానికి సంబంధించిన ఎఫ్‌ఐఆర్ 14 రోజుల వరకూ జాగు చేయొచ్చు. ఈ విషయానికి సంబంధించిన వివిధ కోణాలను అధ్యయనం చేయడంలో స్టేషన్ హౌస్ అధికారి ఆలోచనలు కొనసాగించవచ్చు. బాధితులైన అతడు / ఆమె తమ ఫిర్యాదును ఉపసంహరించాలంటూ ఈ కాలంలో ఒత్తిడి తీసుకురావచ్చు. ఇది పోలీసులలోనూ అవినీతిని దారితీయొచ్చు. తమను తాము కాపాడుకోవడానికి రకరకాలైన పద్ధతులకు పాల్పడే అవకాశం అతడు / ఆమెకు లభించవచ్చు. ఈ కొత్త చట్టాలు తీసుకొచ్చిన మార్పుల వల్ల పేదలు బలహీనులు న్యాయం పొందే హక్కుకు అంత్యంత తీవ్రమైన హాని కలుగుతుంది. వారిప్పటికే అనేక విధాల న్యాయం పొందే హక్కును ఉపయోంచుకోలేకపోతున్నారు. అలాగే ఈ కొత్త చట్టాల ప్రకారం పోలీసులు గత చట్టంలో పేర్కొన్న 15 రోజుల కాలపరిమితిని మించి అధికకాలం పాటు రిమాండులో వుంచాలని కోరవచ్చు. తరచూ నేరాలు చేసేవాళ్లకు (ఇదో కొత్త తరహా విభజన) ఈ కొత్త చట్టం ప్రకారం సంకెళ్లు కూడా వేయొచ్చు. పేదలు, బలహీనులకూ, అణచివేయబడిన వారికి, ప్రభుత్వ ప్రయోజనాలకు హాని కలిగించేవారుగా పోలీసులు భావించేవాళ్లకు న్యాయాన్ని నిరాకరించే అధికారం మరింత పెరుగుతుంది.

124 ఎ మరింత తీవ్రరూపంలో

ఈ నూతన చట్టాలలో అత్యంత ప్రమాదకరమైన మరో అంశమేమంటే 124 ఎ మరో రూపంలో ప్రత్యక్షం కావడం. రాజద్రోహాన్ని నిర్వచించే ఐపిసి 124 ఎ సెక్షన్‌ను సుప్రీం కోర్టు ఇప్పటికే కొట్టివేసింది. కానీ భారతీయ న్యాయసంహితలో 152వ సెక్షన్ మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంతకు ముందట మూల చట్టం 124ఎ లో లేని విధంగా ఇందులో భారత సార్వభౌమత్వం, సమగ్రత అనే ప్రస్తావనలు అదనంగా చేర్చబడ్డాయి. సీనియర్ లాయర్లు చెప్పే ప్రకారం చట్టంలో ఇదివరకు లేని 'జాతి వ్యతిరేక చర్య' అనే అంశం కొత్తగా జొప్పించబడింది. సహజంగానే ఇది వాక్ స్వాతంత్రాన్ని భావ వ్యక్తీకరణను అసమ్మతి హక్కును తీవ్ర స్థాయిలో దెబ్బ తీస్తుంది. వాటికి వ్యతిరేకంగా పని చేస్తుంది. ఈ కొత్త చట్టాలు తీసుకురాక ముందే ఈ ప్రభుత్వం అసమ్మతిదారుల పట్ల వ్యవహరించిన తీరు చాలా దూకుడుగా అన్యాయంగా వుండింది. ఇక ఈ కొత్త చట్టాలతో పరిస్థితి ఇంకా దిగజారుతుంది. అంతేగాక ప్రస్తుతం ఉపా చట్టం కింద వున్న అనేక నేరాలను ఈ కొత్త నేరచట్టంలో పొందుపరిచారు. అంటే నిందితుడు వాస్తవంలో కొత్తనేర చట్టంలో ఉపా కింద ఎన్‌ఐఎ, కొత్త నేర చట్టం కింద పోలీసులు పెట్టే రెండు రకాల చార్జిషీట్లు ఎదుర్కొనవలసి వుంటుంది. చివరకు ఒకే శిక్ష విధించినా ఈ ఈ మొత్తం ప్రక్రియే తీవ్ర శిక్షలా నడుస్తుంది. పైగా ఉపా కింద దర్యాప్తు చేసేది స్థానిక పోలీసు కన్నా పై స్థాయి అధికారి కాగా కొత్త చట్టంలో మామూలు పోలీసు స్టేషన్‌కే టెర్రరిజంపై దర్యాపు చేసే హక్కు వుంటుంది. ఉపా కింద విచారణ జరిపేందుకు ప్రభుత్వ అనుమతి అవసరం కాగా కొత్త చట్టంలో ఒక సాధారణ పోలీసు అధికారి కూడా ఎవరినైనా టెర్రరిజం పేరిట దర్యాప్తు జరిపే అధికారం పొందడం ఇంకా ఆందోళన కలిగించే విషయం.

నిలిపేవరకూ పోరాటం

ఈ నూతన చట్టాలపై గట్టిగా పోరాడాల్సి వుంది. దేశ వ్యాపితంగా న్యాయవాద సంఘాలు నిరసనలు, కోర్టుల బహిష్కరణకు సన్నాహాలు చేస్తున్నాయి. సుప్రీం కోర్టును ఉద్దేశించి పిటిషన్లపై వేలాది మంది సంతకాలు చేసి పంపారు. ఈ చట్టాల గురించిన సమాచారం మరింత విస్తృతంగా తెలిసేకొద్దీ నిరసనలూ వ్యతిరేకత పెరుగుతూనే వుంటాయి. ప్రజాభిప్రాయం నిర్మించడం ద్వారా ఎన్‌డిఎ సర్కారుపై ఒత్తిడి తెచ్చి ఈ కొత్త చట్టాల అమలును నిలుపు చేయవలసిన పరిస్థితి తీసుకు రావాలి. వాటిని తాజాగా మరోసారి సమీక్షించాలి. ఎందుకంటే ఈ చట్టాలు దేశంలోని పౌరులందరి జీవితాలకూ స్వేచ్ఛకు ప్రమాదకరంగా పరిణమించనున్నాయి. వాటిని ఇప్పుడున్న రూపంలో ఆమోదించే ప్రసక్తే వుండకూడదు.

(జులై3 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

> **ఈ చట్టాల గురించిన సమాచారం మరింత విస్తృతంగా తెలిసేకొద్దీ నిరసనలూ వ్యతిరేకత పెరుగుతూనే వుంటాయి. ప్రజాభిప్రాయం నిర్మించడం ద్వారా ఎన్‌డిఎ సర్కారుపై ఒత్తిడి తెచ్చి ఈ కొత్త చట్టాల అమలును నిలుపు చేయవలసిన పరిస్థితి తీసుకు రావాలి. వాటిని తాజాగా మరోసారి సమీక్షించాలి. ఎందుకంటే ఈ చట్టాలు దేశంలోని పౌరులందరి జీవితాలకూ స్వేచ్ఛకు ప్రమాదకరంగా పరిణమించనున్నాయి. వాటిని ఇప్పుడున్న రూపంలో ఆమోదించే ప్రసక్తే వుండకూడదు.**

నలందా చుట్టూ 'నమో' అబద్ధాల కోట

విశ్లేషణ



రామ్ పునియాని

జూన్ 19వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ నలందా విశ్వ విద్యాలయ నూతన ప్రాంగణానికి ప్రారంభోత్సవం చేశారు. మయన్మార్, శ్రీలంక, వియత్నాం, జపాన్, కొరియా లాంటి అనేక దేశాల రాయబారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ దేశాలలో చాలా వరకు చక్రవర్తి అశోకుడు పంపిన బోధకులు బౌద్ధమతాన్ని వ్యాప్తి చేశారు.

మన మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం 2006లో నలందాను ఒక ప్రపంచ ప్రసిద్ధ విశ్వవిద్యాలయంగా పునరుద్ధరించాలనే ఆలోచన చేశారు. దానిని తరువాత బీహార్ అసెంబ్లీ, యుపిఎ ప్రభుత్వం ఆమోదించాయి.

నలందా విశ్వ విద్యాలయాన్ని 12వ శతాబ్దంలో విదేశీ దురాక్రమణదారులు తగులబెట్టారని ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మోడీ అన్నారు. మహమ్మద్ ఘోరీ మంత్రివర్గంలోని బక్తియార్ ఖిల్జీనే నలందా విశ్వవిద్యాలయాన్ని తగులబెట్టాడనే ప్రచారంలో వున్న అభిప్రాయాన్ని ఆయన చిలుక పలుకుల్లా పదేపదే వల్లిస్తున్నారు.

ముస్లిం దురాక్రమణదారులు హిందూ దేవాలయాలను ధ్వంసం చేసి, ఇస్లాం మతాన్ని బలవంతంగా వ్యాప్తి చేశారనే 'సామాజిక ఇంగిత జ్ఞానానికి' ఈ భావనను కూడా చేర్చారు. యాదృచ్ఛికంగానే అయినా, బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన మతతత్వ చరిత్ర రచనతో వీటి ప్రచారం మొదలైంది. ఆ తరువాత హిందూ, ముస్లిం మత స్రవంతులు, దానిని అత్యుత్సాహంతో స్వీకరించాయి.

హిందువులకు వ్యతిరేకంగా ముస్లిం లీగ్ చేసిన కాల్పనిక ప్రచారం పాకిస్తాన్‌లో విధ్వంసానికి కారణమైంది. భారతదేశంలో ముస్లిం లీగ్‌కు వ్యతిరేకంగా మతోన్మాద మంటలను సృష్టించి, ముస్లిం వ్యతిరేక ద్వేషాన్ని వ్యాపింప చేసిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గురించి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇలా వ్యాఖ్యానించాల్సి వచ్చింది.

"వారి ప్రసంగాలు మొత్తం మతోన్మాద గరళంతో నిండి ఉన్నాయి. హిందువులను ఉత్సాహపరిచేందుకు, వారి రక్షణ నిమిత్తం అందరినీ సంఘటితం చేసేందుకు విషాన్ని వ్యాప్తి చేయాల్సిన అవసరం లేదు. ఆ విష వ్యాప్తి ఫలితంగానే దేశం, అమూల్యమైన గాంధీజీ జీవితాన్ని త్యాగం చేయాల్సి వచ్చింది."

నలందా విశ్వవిద్యాలయాన్ని విదేశీ దురాక్రమణదారులే దహనం చేశారనే మోడీ ఆరోపణలు, ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి చెప్పే అబద్ధాల లాంటివే. ఆరవ శతాబ్దంలో బీహార్ లోని రాజ్ గిర్ అనే విశాలమైన ప్రాంతంలో గుప్తులు నిర్మించిన నలందా, ఒక అద్భుతమైన గురుకుల విశ్వవిద్యాలయం. ఇది ఒక బౌద్ధ కేంద్రమని పురావస్తు రుజువులు తెలియజేస్తున్నాయి. ఇక్కడ బౌద్ధతత్వ శాస్త్రమే కాకుండా, బ్రాహ్మణీయ భావజాల మత గ్రంథాలు, గణితం, తర్కం, ఆరోగ్య శాస్త్రాలను కూడా బోధించారు. బహిరంగ చర్చ, తర్కం లాంటి సాంప్రదాయాలు బాగా ప్రజాదరణ పొందాయి. ఇవి అనేక ప్రాంతాలు, రంగాలకు చెందిన విద్యార్థులను, పండితులను ఆకర్షించాయి. ఈ విశ్వవిద్యాలయాన్ని రాజులు సైతం ఆదరించారు. కానీ పాల, సేన రాజ వంశాల రాకతో విశ్వవిద్యాలయానికి ఆదరణ తగ్గింది. చివరికి నూతన విశ్వవిద్యాలయాలకు, ముఖ్యంగా ఓదాంతపురి, విక్రమశిల వంటి వాటికి ప్రాధాన్యత పెరిగింది. ఇదే నలందా విశ్వవిద్యాలయ పతనానికి నాంది అయింది.

లక్షల సంఖ్యలో పుస్తకాలు, రాతప్రతులు, అరుదైన సేకరణలు వున్న గొప్ప నలందా గ్రంథాలయానికి ఎవరు నిప్పు పెట్టారు? ఈ పని చేసింది ఖిల్జీ అని తరచుగా అతనికి ఆపాదిస్తున్నప్పటికీ, దీనిని ధ్రువీకరించే ప్రాథమికమైన వనరులేమీ లేవు. లూటీ చెయ్యడం, బలవంతంగా దోచుకోవడమే ఖిల్జీ ప్రధాన లక్ష్యం. ఖిల్జీ, అయోధ్య నుంచి బెంగాల్‌కు వెళ్ళే మార్గంలో వున్న కిలా-ఇ-బిహార్ కోటలో సంపద వుందనుకొని దానిపై దాడి చేశాడు. అంతేకానీ నలందా విశ్వవిద్యాలయం ఈ మార్గంలో లేదు. వాస్తవానికి, ఇది చాలా దూరంగా ఉంది. కాబట్టి విశ్వవిద్యాలయంపై ఖిల్జీ దాడి చేయడానికి ఎలాంటి కారణం లేదు.



లక్షల సంఖ్యలో పుస్తకాలు, రాతప్రతులు, అరుదైన సేకరణలు వున్న గొప్ప నలందా గ్రంథాలయానికి ఎవరు నిప్పు పెట్టారు? ఈ పని చేసింది ఖిల్జీ అని తరచుగా అతనికి ఆపాదిస్తున్నప్పటికీ, దీనిని ధ్రువీకరించే ప్రాథమికమైన వనరులేమీ లేవు. లూటీ చెయ్యడం, బలవంతంగా దోచుకోవడమే ఖిల్జీ ప్రధాన లక్ష్యం. ఖిల్జీ, అయోధ్య నుంచి బెంగాల్‌కు వెళ్ళే మార్గంలో వున్న కిలా-ఇ-బిహార్ కోటలో సంపద వుందనుకొని దానిపై దాడి చేశాడు. అంతేకానీ నలందా విశ్వవిద్యాలయం ఈ మార్గంలో లేదు. వాస్తవానికి, ఇది చాలా దూరంగా ఉంది. కాబట్టి విశ్వవిద్యాలయంపై ఖిల్జీ దాడి చేయడానికి ఎలాంటి కారణం లేదు.

ఆ కాలంనాటి చరిత్రకు సంబంధించిన అనేక ప్రాథమిక ఆధారాల్లో కూడా ఖిల్జీ, నలందా విశ్వవిద్యాలయానికి వెళ్ళినట్లు ప్రస్తావన లేదు. మిన్హాజ్-ఈ-సిరాజ్ రచించిన తబకత్-ఆ-నాసిరి కూడా ఈ విషయాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. భారతదేశ చరిత్రను ముఖ్యంగా బౌద్ధ మతానికి చెందిన చరిత్రను ఎంతో లోతుగా అధ్యయనం చేసిన ఇద్దరు టిబెట్ స్కాలర్లు అయిన ధర్మస్వామిన్, సుంపాలు కూడా ఖిల్జీ నలందాకు వెళ్ళాడని గానీ, దానిని తగులబెట్టాడని గానీ ఎక్కడా ప్రస్తావన చేయలేదు. టిబెట్‌కు చెందిన మరొక ప్రముఖ బౌద్ధ స్కాలర్ తారానాథ్ అంతకు ముందు అలాంటిదేదీ ప్రస్తావించ లేదు. ఆసక్తికరమైన విషయం ఏమంటే అజంతా, ఎల్లోరా, సాంచీ లాంటి ఇతర ముఖ్యమైన బౌద్ధ నిర్మాణాలు కూడా "దురాక్రమణదారుల" ఆగ్రహానికి గురి కాలేదు. నలందా విశ్వవిద్యాలయాన్ని ఖిల్జీ ధ్వంసం చేశాడనే విషయాన్ని జాదూనాథ్ సర్కార్, ఆర్.సి.మజుందార్ లాంటి భారతీయ చరిత్రకారులు సైతం ఆమోదించడం లేదు.

టిబెట్ సన్యాసి తారానాథ్ రచించిన 'హిస్టరీ ఆఫ్ బుద్ధిజం ఇన్ ఇండియా'లో పేర్కొన్న అంశాలను ప్రాచీన భారత చరిత్రకారుడు డి.ఎన్.ఝా తన 'రెస్పాండింగ్ టు ఎ కమ్యూనలిస్ట్' అనే వ్యాసంలో పేర్కొన్నాడు. "నలేంద్ర (నలందా) దగ్గర కాకుత్సిద్ధ నిర్మించిన దేవాలయ ప్రతిష్టాపన కార్యక్రమంలో యువకులైన అల్లరిచిల్లర 'శ్యామనులు' కొందరు 'తీర్థిక' బిచ్చగాళ్ళపై మురికి నీటిని చల్లడంతో, ఆగ్రహించిన వారిలో ఒకడు జీవనోపాధిని ఏర్పాటు చేసుకోవడానికి వెళ్ళగా, మరొకడు లోతుగా ఉన్న గోతిలో కూర్చొని 'సూర్య సాధన'లో నిమగ్నమై, ఒక యాగాన్ని నిర్వహించి, చుట్టూ బూడిదను చల్లిన ఫలితంగా అద్భుతమైన అగ్ని వచ్చింది."

ఇది బౌద్ధ, బ్రాహ్మణ యాచకుల మధ్య జరిగిన గొడవను సూచిస్తుందని డి.ఆర్.పాటిల్ 'ద యాంటిక్వేరియన్ రిమైన్స్ ఇన్ బీహార్' చెప్తుంది. బ్రాహ్మణులు సూర్య భగవానుని శాంతింపజేసేందుకు ఒక యాగాన్ని నిర్వహించి, అందులో వచ్చిన బూడిదను తీసి బౌద్ధ దేవాలయాల వైపు విసిరారు. ఇదే నాటి గొప్ప పుస్తకాల సేకరణ దగ్ధం కావడానికి దారి తీసింది.

అది...బ్రాహ్మణ ఆధిపత్యం తన పట్టుని నిలుపుకోవడానికి బౌద్ధంపై పెద్ద ఎత్తున దాడులు చేస్తున్న కాలమనే విషయాన్ని కూడా మనం గుర్తుంచుకోవాలి. అశోకుని తరువాత బౌద్ధం భారతదేశంలో విస్తృతంగా వ్యాప్తి చెందినప్పుడు సమానత్వ భావనలు గణనీయంగా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. దాని ఫలితంగా బ్రాహ్మణ ఆచార వ్యవహారాలు కొట్టుకుపోవడంతో బ్రాహ్మణ సమాజంలో అసంతృప్తి పెరిగిపోయింది. తరువాత అశోకుని మనవడైన బృహద్రథ్ అధికారంలో ఉన్నప్పుడు...అతని సర్వసైన్యాధిపతి పుష్యమిత్ర శుంగ అతనిని హత్య చేసి, బౌద్ధులను వేధింపులకు గురి చేశాడు. పగ, ప్రతీకారాలతో బ్రాహ్మణులే గ్రంథాలయాన్ని తగులబెట్టారనే వాస్తవాన్ని అన్ని విశ్వసనీయ వర్గాలు తెలియ జేస్తున్నాయి. నలందా విధ్వంసంలోకి ఖిల్జీని లాగడం అనేది ముస్లింలకు వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి, అదే సమయంలో ఆ కాలంలో బౌద్ధులను వేధించిన వాస్తవ గాథలను దాచి ఉంచడానికి సరిపోతుంది.

ప్రశ్న, చర్చ పునాదిగా విద్య వుండాల్సిన అవసరం ఉంది. విద్యాసంబంధ విషయాలలో విధేయంగా వుండాలంటూ ఆధిపత్య సంస్కృతిని రుద్దుతూ ఊపిరాడకుండా చేస్తున్న సమయంలో మన యూనివర్సిటీలను కాపాడుకోవాల్సిన అవసరముంది. కాని పక్షంలో జ్ఞానాన్ని సముపార్జించడం, విద్యారంగాన్ని అభివృద్ధి చేయడం సాధ్యం కాదు. భారతదేశంలో బ్రాహ్మణ ఆధిపత్య వాదం, బౌద్ధాల మధ్య జరిగిన పోరాటం యొక్క విషాద చరిత్ర నుంచి మనం నేర్చుకోవాల్సింది ఇదే.

(వ్యాసకర్త మానవ హక్కుల కార్యకర్త)
('ద వైర్' సౌజన్యంతో)

కవిత్వం

కొండెక్కిన నిత్యావసర ధరలు

నిత్యం పెరుగుతుండె నిత్యావసర
వస్తువుల ధరలు
కూరగాయల రేట్లు ఘోరాతి
ఘోరంగా ఉన్నాయి
పచారీ సరుకుల ధరలు చూస్తే
పిచ్చెక్కిస్తున్నాయి
పచ్చి మిర్చిధరలు చూస్తుంటేనే
మంట పుట్టు
టమోటా రేట్లు కాంచితే నోట మాట
రావటం లేదు
వంకాయ, బెండ కూడా మన వంక
చూడటంలేదు
బీర, పొట్ల, దొండ రేట్లు సైతం
భీష్మించుకున్నాయి
ఉల్లిపాయలు, అల్లం ధరలకు
ఘొల్లు మనిపిస్తుంది
అన్ని రకాల ధరలను చూస్తే కన్నీరు
మున్నీరు..!
ఎన్నికలకు ముందు ఏలికలు
ఎన్నెన్నో వాగ్దానాలు
ఆకాశం లోని ధరలు అమాంతంగా
అవనికి తెస్తామని
పెద్ద మనుషులు గద్దెనెక్కినా శుద్ధ
ప్రయోజనం?
ప్రజల బతుకులు ఇంకా మారటం
లేదు?
సగటు జీవి జీవన యాత్ర వెగటు
చిత్రమాయే?
నేతలూ..కాస్త నేల చూపులు
ఒక్కసారి చూడండి
పెరుగుతున్న ధరల మెడలను
త్వరగా వంచండి
ప్రజల మీద పడిన పెను భారాలను
దించండి..!?

- జి. సూర్యనారాయణ,
సెల్: 6281725659.

మోడీ ప్రభుత్వం ఆగస్టులో కూలిపోవచ్చు : లాలూ

పాట్నా : బీహార్‌లోని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) పార్టీ అధ్యక్షుడు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ మోడీ ప్రభుత్వం గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఆగస్టులో ప్రభుత్వం కూలిపోయే అవకాశం ఉందని ఆయన జోస్యం చెప్పారు. శుక్రవారం ఆర్‌జెడి పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లాలూ ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. 'నరేంద్ర మోడీ ప్రభుత్వం చాలా బలహీనంగా ఉంది. ఆ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు. వచ్చే ఆగస్టు నెలలో ప్రభుత్వం కూలిపోయే అవకాశం ఉంది. ఎన్నికలు ఎప్పుడైనా జరగవచ్చు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఏడాదిలో రూ.1.16 లక్షల కోట్ల విలువైన రక్షణ ఉత్పత్తులు

- కేంద్ర రక్షణ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ : 2023-24 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తిలో రికార్డు స్థాయి వృద్ధి నమోదైందని రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2023-24లో ప్రభుత్వ అనుబంధ రక్షణ సంస్థలు (డిపిఎస్‌యుఎస్), పిఎస్‌యుఎస్, ప్రైవేట్ రంగ రక్షణ సంస్థల్లో మొత్తంగా రూ.1,26,887 కోట్ల విలువైన రక్షణ ఉత్పత్తులు నమోదైనట్లు తెలిపింది. గతంతో పోలిస్తే ఇది 16.7 శాతం అధికమని పేర్కొంది. ఇందులో ప్రైవేట్ సెక్టార్‌లో 20.8 శాతం ఉత్పత్తి జరిగినట్లు తెలిపింది. రక్షణ ఉత్పత్తి వృద్ధికి ఎగుమతులు కూడా దోహదపడ్డాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తులు రికార్డు స్థాయిలో రూ.21,083 కోట్లకు చేరుకున్నాయని తెలిపింది. గతేడాది పోలిస్తే 32.5 శాతం వృద్ధి నమోదయిందని తెలిపింది.

కేజ్రీవాల్ బెయిల్‌పై సిబిఐ స్పందన కోరిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై సిబిఐ స్పందన తెలపాల్సిందిగా ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. జస్టిస్ నీనా బన్సాల్ కృష్ణ సిబిఐకి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను జులై 17కి వాయిదా వేశారు.

అయితే కేజ్రీవాల్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లకుండా నేరుగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారని జడ్జి పేర్కొన్నారు. సిఆర్‌పిసి సెక్షన్ 439 ప్రకారం హైకోర్టు, ట్రయల్ కోర్టు రెండింటికీ బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు ఉమ్మడి అధికారాలు ఉన్నాయని కేజ్రీవాల్ తరపు న్యాయవాది ఎ.ఎం. సింఘ్వీ పేర్కొన్నారు. లిక్కర్ పాలసీకి సంబంధించిన ఇడి మనీలాండరింగ్ కేసుకు సంబంధించి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను జూన్ 25న తీహార్‌జైలులో సిబిఐ ప్రశ్నించింది. మరుసటి రోజు సిబిఐ అదుపులోకి తీసుకుంది. ఐదురోజుల కస్టడీ కోరుతూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరించింది. మూడు రోజుల కస్టడీ విధిస్తున్నట్లు ప్రత్యేక జడ్జి అమితాబ్ రావత్ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 29తో కస్టడీ ముగియడంతో ఈ నెల 12 వరకు కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తున్నట్లు ట్రయల్ కోర్టు ఆదేశించింది.

దేశవ్యాప్తంగా రెచ్చిపోతున్న గోగూండాలు

- ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు నాయకుల ఆందోళన
- రాయ్‌పూర్‌లో హత్యకు గురైన బాధిత కుటుంబాలకు పరామర్శ
- కుటుంబానికి రూ.లక్ష చొప్పున సాయం

గోగూండాల చేతిలో హత్యకు గురైన యువకులు తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులతో ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు నాయకులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా సంఘ్‌పరివార్ దాడులు పెరిగిపోతున్నాయని, అణగారిన దళితులను, ఆదివాసీలను, ముస్లింలను లక్ష్యంగా చేసుకొని భయకరమైన రీతిలో దాడులకు పాల్పడుతున్నారని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన మూడో రోజు నుంచి గోగూండాలు అనేక రాష్ట్రాల్లో ముస్లింలపై దాడులకు పాల్పడ్డారని తెలిపారు. గత జూన్ 7న ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ రూరల్ జిల్లాలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపికి చెందిన గోగూండాల చేతిలో హత్యకు గురైన ముగ్గురు ముస్లిం యువకుల కుటుంబాలను ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు నాయకులు పరామర్శించారు. ఆ యువకుల తల్లిదండ్రులను, తోబుట్టువులను, వారి పిల్లలను కలుసుకుని ఓదార్చారు. అన్ని విధాల అండంగా నిలుస్తామని భరోసా కల్పించారు. బాధితుల స్వస్థలమైన ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ షామ్లీ జిల్లాలోని లఖ్‌నౌటి, బనాత్ గ్రామాలను నేరుగా వెళ్లి అక్కడున్న బాధితుల తల్లిదండ్రులను, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ బృందంలో ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్, కోశాధికారి పి కృష్ణప్రసాద్, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, సంయుక్త కార్యదర్శులు వి శివదాసన్ (రాజ్యసభ ఎంపి), విక్రమ్ సింగ్, ఎఐకెఎస్ సికెసి సభ్యులు పుష్పేంద్ర త్యాగి, మనోజ్ కుమార్ ఉన్నారు. యుపి కిసాన్ సభ నాయకులు దౌద్ ఖాన్, సుశీల్ కుమార్ రాణా, ధర్మేందర్ సింగ్, వీరేందర్ సింగ్ కూడా పాల్గొన్నారు. గోగూండాల చేతిలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు యువకుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని నాయకులు అందజేశారు. గత జూన్ 7న రాయ్‌పూర్‌లో జరిగిన గోగూండాల దాడిలో చాంద్ మియాన్ ఖాన్ (డ్రైవర్), కూలీలు సద్దాం ఖురేషీ,తెహ్సీమ్ ఖురేషీ చనిపోయిన సంగతి విదితమే.

ఈ సందర్భంగా ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు నాయకులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి..మోడీ సర్కార్ మళ్లీ అధికారంలోకి వచ్చిరాగానే దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపికి చెందిన గోగూండాలు దారుణాలకు పాల్పడ్డారని తెలిపారు. అనేక చోట్ల అమాయక ముస్లిం యువకులను లక్ష్యంగా చేసుకొని దాడులు జరిగాయని, కొన్ని చోట్ల ప్రాణాలు బలిగొన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాయ్‌పూర్ గోంగూడాల దాడి కేసులో చాలా రోజుల తరువాత పోలీసులు నలుగురిని అరెస్టు చేశారని, వారిలో ఒకడు బిజెపి అనుబంధ యువజన మోర్చా (బిజెవైఎం) జిల్లా స్థాయి నేత రాజా అగర్వాల్ కూడా ఉన్నాడని తెలిపారు. దాడి జరిగిన ఛత్తీస్‌గఢ్, బాధితుల స్వస్థలమైన ఉత్తరప్రదేశ్‌లోనూ బిజెపి ప్రభుత్వాలే ఉన్నాయని, కానీ బాధిత కుటుంబాలకు ఇప్పటి వరకు న్యాయం జరగలేదని తెలిపారు. నేరస్థులపై ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

లోక్ అదాలత్‌లతో సత్వర పరిష్కారం

- సద్వినియోగానికి సిజెఐ పిలుపు

న్యూఢిల్లీ : లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర పరిష్కారాలు లభిస్తాయని, కక్షిదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని భారత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ మేరకు ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. సుప్రీంకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్న పౌరులు తమ వివాదాలను సామరస్యంగా, సత్వరంగా పరిష్కరించుకోవడానికి ప్రత్యేక లోక్ అదాలత్‌లో పాల్గొనాలని సూచించారు. సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించుకోవడానికి, సుప్రీంకోర్టు ఏర్పాటై 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జులై 29 నుంచి ఆగస్టు 3 వరకూ ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భారీ సంఖ్యలో పెండింగ్ కేసులు కోర్టులో పేరుకుపోవడం న్యాయమూర్తుల్లో ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. తన సహోద్యోగులందరి తరపున, సుప్రీంకోర్టు సిబ్బంది తరపున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేసులు పెండింగ్‌లో ఉన్న పౌరులకు, న్యాయవాదులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు సిజెఐ తెలిపారు.

తొక్కిసలాట బాధితులకు రాహుల్ పరామర్శ

- ప్రభుత్వ తప్పిదాలూ కారణమేనని వెల్లడి

అలీగఢ్ : వందమందికి పైగా ప్రజలు దారుణంగా చనిపోవడానికి దారి తీసిన హత్రాస్ ఘటనను రాజకీయం చేయాలని తాను భావించడం లేదని, కానీ ఈ వ్యవహారంలో ప్రభుత్వ యంత్రాంగం తప్పులు కూడా వున్నాయని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం వ్యాఖ్యానించారు. తొక్కిసలాట బాధితులను శుక్రవారం ఉదయం కలిసి పరామర్శించిన రాహుల్ అనంతరం విలేకర్లతో మాట్లాడారు. 121 మంది అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయని, అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, ఇది విచారించాల్సిన విషయమని అన్నారు. తక్షణమే జాప్యం లేకుండా బాధితులకు మరింత ఎక్కువగా నష్టపరిహారం అందచేయాలని యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరారు. ఈ విషాదాన్ని రాజకీయ కోణంలో చూసి మాట్లాడాలని అనుకోవడం లేదు. కానీ పాలక పక్షం వైపు నుండి కూడా కొన్ని తప్పులు జరిగాయన్నారు. వాటిని గుర్తించాలని కోరారు. పోలీసుల ఏర్పాట్లు అక్కడ వుండాలని, కానీ లేవన్నారు. మరణించిన వారందరూ నిరుపేదలని, ఈ సమయం వారికి చాలా క్లిష్టమైనదని, అందువల్ల ఆలస్యం లేకుండా వెంటనే గరిష్ట మొత్తంలో నష్టపరిహారాన్ని అందచేయాలని కోరారు. ఆర్నెల్లు ఏడాది తర్వాత ఉపయోగం వుండదన్నారు. ఢిల్లీ నుండి వచ్చిన రాహుల్ వెంట యుపి కాంగ్రెస్ చీఫ్ అజయ్ రాయ్, ఇతరనేతలు వున్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ 4జి, 5జి సేవలను ప్రారంభించాలి

కేంద్ర కమ్యూనికేషన్ మంత్రికి తపన్‌సేన్ లేఖ



న్యూఢిల్లీ : దేశంలోనే రెండు ప్రధాన టెలికం సర్వీస్ ప్రొవైడర్లు అయిన రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ సంస్థలు ఇటీవల టారిఫ్‌లు పెంచిన నేపథ్యంలో బిఎస్‌ఎన్‌ఎల్ తక్షణమే 4జి, 5జి సేవలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక లేఖ రాశారు. రిలయన్స్ జియో తన టారిఫ్‌ను 12 శాతం నుండి 25శాతానికి పెంచగా, ఎయిర్‌టెల్ 11 నుండి 21శాతానికి పెంచింది. ఈ పెరిగిన ధరలతో సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు పడతారని, కంపెనీలు మాత్రం అదనంగా రూ.20వేల కోట్ల లాభాలను పొందేలా టారిఫ్‌లను పెంచాయని అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ జియో రూ.20607కోట్లు, ఎయిర్‌టెల్ రూ.7467 కోట్లు నికర లాభాలను ఆర్జించాయని చెప్పారు. ఒక్కో వినియోగదారుడి నుండి సగటు రెవిన్యూ పెంచుకునేందుకు తమ ఈ చర్య ఉద్దేశించబడిందని ఆ కంపెనీలు పేర్కొన్నాయి. కానీ ఇది ప్రజలను తప్పుదారి పట్టించే చర్య అని తపన్‌సేన్ ఆ లేఖలో పేర్కొన్నారు. సామాన్యులను తీవ్రంగా దెబ్బ తీసే ఈ టారిఫ్ పెంపులు ఎంతమాత్రమూ సమర్థనీయం కాదని, తక్షణమే వాటిని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో ప్రభుత్వ సంస్థ అయిన బిఎస్‌ఎన్‌ఎల్‌కు సమాన అవకాశాలను ప్రభుత్వం కల్పించకుండా వివక్షతో వ్యవహరిస్తోందని ఆ లేఖలో తపన్‌సేన్ పేర్కొన్నారు. ప్రస్తుతమున్న 3జికి పూర్తి స్థాయిలో 4జి సేవలందించేలా సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ జరగడం లేదని అన్నారు. అలాగే 5జిని కూడా తీసుకురావడం లేదన్నారు. అంతర్జాతీయ విక్రేతల నుండి 4జి పరికరాలను సమీకరించుకునేందుకు బిఎస్‌ఎన్‌ఎల్‌ను అనుమతించడం లేదన్నారు. దీనివల్ల బిఎస్‌ఎన్‌ఎల్‌కు 4జి, 5జి అందుబాటులో లేవన్నారు. వినియోగదారులకు ఈ సేవలు అందించలేకపోతోంద న్నారు. ఫలితంగా ప్రైవేటు ఆపరేటర్లతో పోటీలు పడలేక, వారి ఏకపక్ష టారిఫ్ పెంపును అడ్డుకోలేకపోతోందన్నారు. దీనివల్ల వినియోగదారులకు బిఎస్‌ఎన్‌ఎల్ అధిక వేగంతో కూడిన సేవలను అందిచలేకపోతోందన్నారు. ఫలితంగా పెద్ద సంఖ్యలో వినియోగదారులను బిఎస్‌ఎన్‌ఎల్ కోల్పోతోందన్నారు. వీరందరూ జియో, ఎయిర్‌టెల్‌లకు మారిపోతున్నారని తపన్‌సేన్ ఆ లేఖలోపేర్కొన్నారు. 2023-24 సంవత్సరంలోనే బిఎస్‌ఎన్‌ఎల్ కోటీ 80క్షల మంది వినియోగదారులను కోల్పోయిందన్నారు.

ఈ పరిస్థితుల్లో తదుపరి జాప్యం లేకుండా బిఎస్‌ఎన్‌ఎల్ 4జిని ప్రారంభించాలని ఆయన కోరారు. అలాగే 4జిని 5జికి ఆధునీకరించాలని కూడా కోరారు. దీనివల్ల ఈ దేశంలోని సామాన్యుల ప్రయోజనాలను లాభార్జనే ధ్యేయంగా గల ప్రైవేట్ టెలికం కంపెనీల నుండి కాపాడినట్లవుతుందన్నారు. త్వరలోనే దీనిపై సానుకూలంగా స్పందించగలరని ఆశిస్తున్నట్లు ఆ లేఖలో తపన్‌సేన్ పేర్కొన్నారు.

సిపిఎం నాయకునిపై టిడిపి దాడి

(మొదటి పేజీ తరువాయి)

దాడికి పాల్పడ్డారని రొంపిచర్ల పోలీసులకు రామారావు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చికిత్స పొందుతున్న కామినేని రామారావును సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, నాయకులు ఏపూరి గోపాలరావు, డి శివకుమారి, సిలార్ మసూద్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ లబ్ధిదారులకు అండగా నిల్చిన రామారావుపై టిడిపి వారు దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఇంటింటికి వెళ్లి పింఛను పంపిణీ చేశారని, అందుకు విరుద్ధంగా పరగటిచర్ల గ్రామంలో టిడిపి నాయకుని ఇంటి వద్దకు వచ్చి పింఛను తీసుకోవాలని దండోరా వేయడం, సచివాలయ సిబ్బంది సైతం టిడిపి నాయకుని నివాసంలో ఉండి పింఛను ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. టిడిపి నాయకులు కక్ష పూరిత రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. రామారావుపై దాడి చేసిన టిడిపి నాయకులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

కామినేని రామారావుపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీలు పేర్కొన్నాయి. ఈ మేరకు శుక్రవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి.

తమిళనాడు బిఎస్‌పి చీఫ్ దారుణ హత్య

చెన్నై : తమిళనాడు బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధ్యక్షులు కె.ఆర్మ్‌స్ట్రాంగ్ శుక్రవారం దారుణ హత్యకు గురయ్యారు. చెన్నైలోని సెంబియమ్ ప్రాంతంలోని ఆయన నివాసానికి సమీపంలోనే ఈ హత్య జరిగింది. పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న సమయంలో బైక్‌పై వచ్చిన ఆరుగురు దుండగులు ఆర్మ్‌స్ట్రాంగ్‌పై కత్తులతో దాడి చేసి, పారిపోయారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించినా అప్పటికే ఆర్మ్‌స్ట్రాంగ్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. న్యాయవాది అయిన ఆర్మ్‌స్ట్రాంగ్ 2006లో చెన్నై కార్పొరేషన్ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. బిఎస్‌పి అధ్యక్షులు మాయావతిని ఆహ్వానించి రెండేళ్ల క్రితం చెన్నైలో మెగా ర్యాలీని నిర్వహించారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యపై మాయావతి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దుండగులుపై కఠిన చర్యలు తీసుకోవాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కోరారు.

ఎంపీలుగా అమృత్‌పాల్ సింగ్, ఇంజనీర్ రషీద్ ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించిన అమృతపాల్ సింగ్, ఇంజనీర్ రషీద్‌లు శుక్రవారం ఎంపీలుగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రస్తుతం జైలులో ఉన్న వీరికి ప్రమాణస్వీకారం కోసం కోర్టులు పెరోల్‌ను మంజూరు చేశాయి. దీంతో ప్రత్యేక భద్రత మధ్య వీరిని పార్లమెంట్‌కు శుక్రవారం ఉదయం తీసుకొని వచ్చారు. లాంఛనాలు పూర్తి చేసిన తరువాత లోక్‌సభ స్పీకర్ ఛాంబర్‌లో ప్రమాణీస్వీకారం చేశారు. పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ నియోజకవర్గం నుంచి అమృత్‌పాల్ సింగ్, జమ్ముకాశ్మీర్‌లోని బారాముల్లా నుంచి ఇంజనీర్ రషీద్‌గా ప్రసిద్ధి చెందిన షేక్ అబ్దుల్ రషీద్‌లు భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఉగ్రవాదులకు నిధుల చేరవేసిన అభియోగాలపై ఉపా చట్టం కింద అరెస్టయిన రషీద్ తీహార్ జైల్లో ఉండగా, జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టయిన అమృత్‌పాల్ సింగ్ అస్సాంలోని దిబ్రూగఢ్ జిల్లా జైల్లో ఉన్నారు. ప్రమాణస్వీకారం కోసం ప్రయాణ సమయాన్ని దృష్టిలో పెట్టుకుని ఢిల్లీలోని ఉన్న రషీద్‌కు రెండు గంటల పెరోల్, అస్సాంలో ఉన్న సింగ్‌కు నాలుగు రోజుల కస్టడీ పెరోల్ మంజూరు చేశారు.

వరదలకు అస్సాం విలవిల

గౌహతి : వరుస వరదలతో అస్సాం విలవిల్లాడుతోంది. ఎటుచూసినా దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాన నదులన్నీ ప్రమాద స్థాయిని దాటి పొంగి పొర్లుతున్నాయి. దాదాపుగా 22 లక్షల మంది ప్రజలు వరద బాధితులుగా మారారు. గత 8 రోజులుగా నీటిలో నానుతున్న దిబ్రూగఢ్ పట్టణంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ వరద పరిస్థితులను సమీక్షించారు. తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుద్ఘాతం వల్ల ఎవరూ ప్రమాదం బారిన పడకుండా వుండేందుకే విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు అధికారులు చెబుతున్నారు. దిబ్రూగఢ్ పట్టణం మూసుకుపోయిన డ్రెయిన్లు కారణంగా పట్టణంలో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. పైగా మరోవైపు బ్రహ్మపుత్ర నది కూడా ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తోంది. నీటినిబయటకు పంపడం మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు తెలిపారు. 29 జిల్లాల్లో దాదాపు 22లక్షలమంది వరద బారిన పడ్డారు. వరదలు, కొండచరియలు విరిగిపడడం, తుపానుల్లో మృతి చెందిన వారి సంఖ్య 62కి పెరిగింది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — గవర్నర్‌పేట - 2 బ్రాంచి, 27-18-85, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ, కృష్ణా జిల్లా, ఎపి- 520001

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు / కో-అప్లికెంట్స్ / తనఖాదారులు/ హామీదారులు / కో-ఆబ్లిగెంట్స్ : శ్రీ వేమూరు వెంకటేశ్వర్లు, తండ్రి : శ్రీ విశ్వేశ్వరరావు, డి.నెం. 29-28-5, దాసరి వారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ - 520002, కృష్ణా జిల్లా.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియావారి బకాయి వసూలు కొరకు శ్రీ వేమూరు వెంకటేశ్వర్లు గారికి చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 20-05-2021** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 17-11-2021**న అధీకృత అధికారి సూచనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది.

విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 20-05-2021** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

ఆస్తి వివరములు : సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 3070/2013, తేది : 18-05-2013 : శ్రీ వేమూరు వెంకటేశ్వర్లు, తండ్రి : విశ్వేశ్వరరావు గారి పేరిట ఎపి, విజయవాడ, విజయవాడ రూరల్, ప్రసాదంపాడు, డి.నెం. 5-84, అసిస్ట్ నెం. 479, ఆర్.ఎస్.నెం. 57/7 నందు అవిభక్తవాటా 32.0 చ॥గ॥ల ఆస్తితోపాటు మొత్తం 484.00 చ॥గ॥ల విస్తీర్ణంలో నిర్మించిన రాజగోపాల్ టవర్స్ గ్రూప్ హౌస్ నందు 935 చ॥అ॥ల విస్తీర్ణంతో మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం. ఎఫ్ఎఫ్.-3. **అపార్ట్‌మెంట్‌కి హద్దులు : ఉత్తరం :** ఇతరుల ఆస్తి, **దక్షిణం :** రోడ్డు, **తూర్పు :** ఇతరుల ఆస్తి, **పడమర :** మండవ వెంకట రత్న కుమారి గారి ఆస్తి, **ఫ్లాట్‌కి హద్దులు : ఉత్తరం :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **తూర్పు :** శూన్యాకాశము, **పడమర :** కామన్ కారిడార్

తేది : 05-07-2024
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

Karur Vysya Bank — Smart way to bank
ది కరూర్ వైశ్యాబ్యాంకు లిమిటెడ్
డి.నెం.3-43, వార్డు నెం.3, నేతాజీవీధి, పోరంకి, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521137. సెల్ నెం.89193 69260

బంగారు నగల వేలము ప్రకటన

ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారుడు బంగారు నగలపై మా శాఖలో అప్పు తీసుకొని సకాలంలో తమ బకాయిలు చెల్లించని కారణంగా బ్యాంక్ నిబంధనలు ప్రకారం **తేది.16.07.2024 అనగా మంగళవారం సాయంత్రం 3.00 గం॥లకు** మా బ్రాంచ్ ఆవరణలో వేలం వేసి బాకీలు వసూలు చేసుకుందామని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షరతులు నిబంధనలు: 1) వేలంలో పాల్గొనదలచినవారు **రూ.10,000/-లు** ధరావత్తు కట్టి వేలంలో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 3) నగలు బరువునకు, నాణ్యతకు బ్యాంకు వారి పూచీ ఏమాత్రం లేదు. 4) ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుకొనుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ, వేలం ఆపుటకు గానీ, రద్దు చేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 5) అడ్రస్ నిర్ధారించు ఆధార్ కార్డు కాపీని గాని, పాన్‌కార్డు కాపీని జతచేయవలెను. 6) ఈ ఖాతాదారులలో ఎవరైననూ మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 7) అప్పు వసూలు నోటీసు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటన తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవలెను. 8) జి.ఎస్.టి. వర్తించబడును., 9) ఆన్‌లైన్ బిడ్స్ కూడా స్వీకరించబడును.

ఖాతా నెం.	ఋణగ్రస్తుని పేరు మరియు చిరునామా	ఆభరణముల సంఖ్య	బంగారం బరువు గ్రా॥లో
146393073867	సుబ్బారావు.కె, 74-6/4-1, చెన్నుపాటి భాస్కర్ వీధి, అయ్యప్ప నగర్, విజయవాడ-520007	05	61.50
146392924274		06	19.10

తేది : 05.07.2024
ప్రదేశం : పోరంకి
సం/- అధీకృత అధికారి
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — కారంపూడి బ్రాంచి-19821
చిరునామా: కరణంగారి బజారు, కారంపూడి గ్రామము, కారంపూడి మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522614.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
{సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2)/8(6)}

టు: ఋణగ్రహీత: శ్రీ దరివేముల మరియదాస్, తండ్రి: మట్టయ్య, హెచ్.నెం. 02-000, ఒప్పిచర్ల గ్రామము, కారంపూడి మండలం, గుంటూరు జిల్లా, ఎపి-522614. **శ్రీమతి దరివేముల మరియయ్య, భర్త: దరివేముల మరియదాస్,** హెచ్.నెం. 02-000, ఒప్పిచర్ల గ్రామము, కారంపూడి మండలం, గుంటూరు జిల్లా, ఎపి-522614. **హామీదారులు: శ్రీమతి వల్లెపు పద్మ, భర్త: శ్రీనివాసరావు,** హెచ్.నెం. 6-88, వడ్డెర బజారు, కారంపూడి గ్రామము, కారంపూడి మండలం, గుంటూరు జిల్లా, ఎపి-522614. **శ్రీ వల్లెపు నాగరాజు, తండ్రి: శ్రీనివాసరావు,** హెచ్.నెం. 6-88, వడ్డెర బజారు, కారంపూడి గ్రామము, కారంపూడి మండలం, గుంటూరు జిల్లా, ఎపి-522614. **శ్రీ వల్లెపు బాల తనుష్, తండ్రి: శ్రీనివాసరావు,** హెచ్.నెం. 6-88, వడ్డెర బజారు, కారంపూడి గ్రామము, కారంపూడి మండలం, గుంటూరు జిల్లా, ఎపి-522614.

సర్/మేడమ్,

విషయం : సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం బ్యాంకు బకాయి వసూలు కొరకు శ్రీమతి దరివేముల మరియయ్యకు చెందిన ఆస్తి అమ్మకం.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కారంపూడి బ్రాంచి వారిచే** సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద **డిమాండ్ ప్రకటన తేది.22-08-2023** ద్వారా నాచే / బ్యాంక్‌చే డిమాండ్ చేసినప్పటికీ మీరు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. కావున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6/8 తో చదివే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ అధీకృత అధికారిచే దిగువ తెలిపిన ఆస్తిని **తేది.25-03-2024** న **స్వాధీనం చేసుకోవడం** జరిగింది.

ఆస్తిని స్వాధీనం చేసుకొన్నప్పటికీ మీరు బ్యాంక్‌కు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించలేదు, అందువలన ఈ ప్రకటన తేది నుండి 30 రోజుల తర్వాత ఆన్‌లైన్ పద్ధతిలో బహిరంగ ఇ-వేలం ద్వారా దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించుట తప్పనిసరి అయినది.

ఇ-వేలం తేది మరియు సమయం, ఆస్తి యొక్క రిజర్వుధర మరియు సర్వీస్ ప్రొవైడర్ వివరాలు అమ్మకం ప్రకటన ద్వారా తెలియజేయబడతాయి, అది విడిగా జారీ చేయబడుతుంది.

కావున మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన మొత్తాన్ని తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు సేల్ నోటీసును ప్రచురించే తేదీకి ముందు బ్యాంక్ చేసిన ఖర్చులతో సహా కలిపి మీరు చెల్లిస్తే షెడ్యూల్‌లో పేర్కొన్న ఆస్తి అమ్మకానికి గాను ఎటువంటి తదుపరి చర్య తీసుకోబడదు. సదరు చట్టం యొక్క సెక్షన్ 13(8) పరిధిలో విడిపించుకునే హక్కు లభిస్తుంది.

షెడ్యూల్ ఆస్తులు

పల్నాడు జిల్లా, కారంపూడి మండలం, ఒప్పిచర్ల గ్రామము, అసెస్‌మెంట్ నెం.1686, సర్వే నెం.834/1 నందు మొత్తం 442.30 చ॥గ॥ విస్తీర్ణముగల మొత్తం స్థలములో అవిభాజ్యపు భాగమైన 51.11 చ॥గ॥ విస్తీర్ణము మరియు కామన్ ఏరియాలతో కలుపుకొని 1550 చ॥అ॥ విస్తీర్ణములో నిర్మించిన భవనము మరియు ఇంటి స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **స్థలమునకు హద్దులు: తూర్పు:** 11.6 అ॥ రాయనుతుల నాగభూషణం యొక్క ఇల్లు; **పడమర:** 11.6 అ॥ పంచాయతీ బజారు; **ఉత్తరం:** 40 అ॥ మాచర్ల ఏలియా యొక్క ఇల్లు; **దక్షిణం:** 40 అ॥ మాచర్ల ఏలియా యొక్క ఇల్లు.

తేది : 15-06-2024
ప్రదేశము : కారంపూడి
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నరసరావుపేట మెయిన్ బ్రాంచి

CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ♦ DEPOSITS — Translating Dreams into Reality
కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
40-5-19/17, 1వ అంతస్తు, సిద్ధార్థ కాలేజి బస్టాప్ దగ్గర, మొగల్‌రాజపురం, విజయవాడ - 520010. ఫోన్ : 0866-2474781 / 2481731. సెల్ : 7625079119
Email: vijaywada@canfinhomes.com. CIN:L8511OKA1987PLC008699

చరాస్తుల వేలం కొరకు పేపరు ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (నం. 54 ఆఫ్ 2002) క్రింద చరాస్తుల విక్రయం. అయితే **కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్, విజయవాడ బ్రాంచి** యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద సెక్షన్ 13 (2) క్రింద జారీచేసిన నోటీసుకు అనుగుణంగా క్రింది చరాస్తులను స్వాధీనం చేసుకున్నారు. కంపెనీ బకాయిలను మరియు ఆసక్తులు మరియు ఖర్చులతో పూర్తి చేయడం కోసం, **"ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన విక్రయించబడును. ఈ చట్టంలోని సెక్షన్ 13 (4) క్రింద పేర్కొన్న ఆస్తులను విక్రయించడం ద్వారా కంపెనీ బకాయిలను గ్రహించాలని ప్రతిపాదించింది.

అకౌంట్ పేరు : శ్రీ ముంజి హరిబాబు (అప్లికెంట్), శ్రీమతి ముంజి లత నూకమణి (కో-అప్లికెంట్)
ఎన్.పి.ఎ. తేది : 31-01-2021
డిమాండ్ నోటీసు తేది : 01-04-2021
స్వాధీనం చేసుకున్న తేది (పంచనామా & ఇన్వెంటరీ) : 13-12-2021

చరాస్తుల వివరములు

వ.సం.	ఆర్టికల్స్ యొక్క వివరాలు	నెం.
1	క్రాంప్టన్ కంపెనీకి చెందిన సీలింగ్ 3 ఫ్యాన్స్	3
2	4 ప్లాస్టిక్ చైర్స్	4
3	శాంసంగ్ రిఫ్రిజిరేటర్	1
4	బజాజ్ కంపెనీకి చెందిన 25 లీ॥ కెపాసిటీ వాటర్ హీటర్	1
5	3 × 6 సైజు ఐరన్ అల్మరా	2
6	కంట్రీ ఉడ్ కి చెందిన 7 × 6 సైజు కాట్	2
7	కంప్యూటర్ టేబుల్	1
	మొత్తం : 15,320/-	

నియమ నిబంధనలు మరియు షరతులు :
1. ఈ నోటీసును ప్రచురించిన తేది నుండి ఉ॥ 10.00 గం॥ ల నుండి సా॥ 5.00 గం॥ల మధ్యన పై కార్యాలయం నుండి ఉద్దేశించిన బిడ్డర్లు టెండర్ ఫారమ్‌లను పొందవచ్చును. (ఏదైనా పనిదినములలో)
2. నిబంధనలు & షరతులు : టెండర్ ఫారమ్ ప్రకారం
3. **టెండర్ ఫారమ్ సమర్పించు తేది : ది : 15-07-2024, ఉ॥ 11.45 ని॥లకు లేదా అంతక ముందు**
4. **టెండర్లు తెరిచే తేదీ, సమయం & స్థలం : ది. 15-07-2024, మధ్యాహ్నం : 12.30 ని॥లకు పైన పేర్కొన్న ఏరియా కార్యాలయ చిరునామాలో.**

తేది : 05-07-2024
ప్రదేశం : విజయవాడ
సం/-
అధీకృత అధికారి
కెన్ ఫిన్ హోమ్స్ లి.,

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — గవర్నర్‌పేట బ్రాంచి (01451) : # 27-18-85, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ, ఎ.పి - 520002

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు / హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, భౌతికంగా స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన **బకాయి మొత్తమును** ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి వారిచే** ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 14-08-2024**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు రిజర్వు ధర మరియు ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.**

ఋణగ్రహీత / హామీదారుల వివరములు : 1) శ్రీమతి తుమ్మల జమున (ఋణగ్రహీత), భర్త : పి.ఎస్. ప్రకాశరావు, నెం. 32-42-70, రామాలయం వీధి, మారుతీనగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520004. **2) శ్రీ పుత్తబోయిన సూర్యప్రకాశరావు (కో-అప్లికెంట్),** నెం. 32-42-70, రామాలయం వీధి, మారుతీనగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520004.

బకాయి మొత్తం : ది. 27-11-2023 నాటికి రూ. 22,85,660.07/- (అక్షరాలా ఇరవై రెండు లక్షల ఎనభై ఐదు వేల ఆరు వందల అరవై రూపాయల ఏడు పైసలు మాత్రమే) మరియు ఒప్పందం చేసుకున్న రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 3504/2016, తేది : 13-07-2016 : విజయవాడ, గవర్నర్‌పేట, కొత్త మున్సిపల్ వార్డు నెం. 24, పాత మున్సిపల్ వార్డు నెం. 21, డోర్ నెం. 29-3-8 వద్ద గల సత్య లక్ష్మి అపార్ట్‌మెంట్ నందు రెండవ అంతస్తులో ప్లింత్ ఏరియా 896 చ॥అ॥ల విస్తీర్ణంలోని ఫ్లాట్ నెం. 2కి చెందిన ఆర్‌సిసి రూఫ్డ్ 2 బి.హెచ్.కె. రెసిడెన్షియల్ ఫ్లాట్. ఫ్లాట్‌కి **హద్దులు : తూర్పు :** కారిడార్, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** ఎస్. భాస్కరం గారి ఫ్లాట్ నెం. ఎస్.ఎఫ్. 3, **ఉత్తరం :** శూన్యాకాశము. స్థలమునకు **హద్దులు : తూర్పు :** మున్సిపల్ రోడ్డు - 43.10 అ॥, **దక్షిణం :** అలుగోజు రామన్న గారి ఆస్తి - 78.00 అ॥, **పడమర :** గోవిందరాజు పూర్ణ చంద్రరావు గారి ఆస్తి - 43.10 అ॥, **ఉత్తరం :** సాంమ్రాజ్య లక్ష్మి గారి ఆస్తి - 78.00 అ॥.

రిజర్వు ధర : రూ. 33,06,000/- ధరావత్తు : రూ. 3,30,600/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://www.ibapi.in** మరియు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వెబ్ సైట్ : **www.unionbankofindia.co.in** నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు **అధీకృత అధికారి / చీఫ్ మేనేజర్ శ్రీమతి టి. శ్రీలక్ష్మి** గారి మొబైల్ నెం. **73061 42248 (M)** బ్రాంచి **Mail ID : ubin0801453@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.

చట్టబద్ధమైన ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని చట్టం 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 05-07-2024
ప్రదేశం : విజయవాడ
సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సొగసు చూడతరమా

విందామా వీనుల విందుగా
అందాల తోటలో వింత పాట
కందామా కనుల పండువగా
రంగు రంగుల పూలు
సుగంధాల్ని మోసే గాలులు
మల్లె తీగ మొగ్గల్నే చూస్తే
మంచు ముత్యాల్లానే వుంటాయ్
చెట్లపై ఎగిరే రామచిలుకలు
పొదలపై తిరిగే సీతాకోకచిలుకలు
పూదోటలో అవి చేసే నాట్యభంగిమల
సొగసుచూడ తరమా...

ఆ పక్కనే చిరు సరస్సు
అందమొలికించు ఉషస్సు
పరచుకున్న పచ్చిక బయళ్ళు
అప్పుడప్పుడు అగుపించే నెమళ్లు
శ్వేతవర్ణంలో ఈదులాడే బాతులు
చూడ చక్కనైన వాటి మూతులు
స్వేచ్ఛగా ఊగిసలాడే పిచ్చుకలు
ఒక్కోప్పుడు కనిపించే రంగులవిల్లు
ఆ చెట్టుపై కట్టుకున్న పిట్టగూళ్లు

చిన్నారుల సరదా కేరింతలు
ఉదయాన కోకిలల పలకరింతలు
వుండేది వంకర టింకర బాట
ఆడేది దాగుడుమూతలాట
మాతో మా తోటలో ప్రకృతి పాట
అది మా జ్ఞాపకాల తీపి మూట
మది మధురానుభూతుల ఊట
అసలు ప్రకృతి కవితయే మా తోట
హుషారెత్తించేది ప్రతి పూట ...

- డా: చిట్యాల రవీందర్,
77988 91795

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. గుర్తించండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

బి.రూహిత,
4వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

విషవాయువు పీల్చి ఐదుగురి మృతి

రాయ్‌పూర్ : బావిలో ఉన్న విషవాయువు పీల్చి ఐదుగురు మృతి చెందిన సంఘటన ఛత్తీస్‌గఢ్‌లోని జాంజ్‌గిర్-చంపా జిల్లాలో శుక్రవారం జరిగింది. బిర్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని కికిర్దా గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగిన ఈ సంఘటనలో మృతులను రామచంద్ర జైస్వాల్, రమేష్ పటేల్, రాజేంద్ర పటేల్, జితేంద్ర పటేల్, టికేశ్వర్ చంద్రగా గుర్తించినట్లు బిలాస్‌పూర్ రేంజ్ ఐజిపి సంజీవ్ శుక్లా తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ముందుగా బావిలో పడిన ఒక దుంగను బయటకు తీయడానికి జైస్వాల్ బావిలోకి దిగి స్పృహ తప్పి పడిపోయారు. దీంతో అతని కుటుంబ సభ్యులు సహాయం కోసం కేకలు వేయడంతో రమేష్ పటేల్, రాజేంద్ర పటేల్, జితేంద్ర పటేల్ బావిలోకి దిగి వారు కూడా స్పృహ తప్పి పడిపోయారు. ఈ తరువాత టికేశ్వర్ చంద్ర బావిలోకి దిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం బయటకు తీసినట్లు శుక్లా తెలిపారు.

జనరల్ కోచ్‌ల పెంపుదలకు ప్రత్యేక డ్రైవ్ : అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ : రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్యను భారీగా పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు కేంద్ర రైల్వేశాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇప్పటికే 2,500 జనరల్ కోచ్‌ల తయారీ చేపట్టామని, మరో 10 వేల కోచ్‌ల తయారీకి కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించిందని ఆయన తెలిపారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మరో 50 అమృత్ భారత్ రైళ్ల తయారీని ప్రారంభించామన్నారు. గతేడాది డిసెంబర్‌లో మాల్దా, దర్భాంగా నుంచి ప్రధాని మోడీ రెండు అమృత్ భారత్ రైళ్లను ప్రారంభించినట్లు తెలిపారు. ఇవేకాక మరో 150 అమృత్‌భారత్ రైళ్ల తయారీ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. గతేడాది 5,300 కొత్త రైల్వే ట్రాక్‌లను జోడిస్తామని, ఈ ఏడాది కూడా 800 కిలోమీటర్ల పైగా ట్రాక్‌లను జోడిస్తామని రైల్వే మంత్రి తెలిపారు. కవాచ్ సిస్టమ్ అమలు చేసే ప్రక్రియ వేగవంతంగా సాగుతోందని మంత్రి వైష్ణవ్ తెలిపారు.

వెనక్కి తగ్గిన ఉక్రెయిన్

కైవ్ : ఉక్రెయిన్ సైన్యం తూర్పు నగరం చాసివ్ యార్ నుండి వెనక్కి తగ్గింది. ఆ ప్రాంతాన్ని తమ బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయని రష్యా ప్రకటించింది. తూర్పు డొనెట్స్క్ ప్రాంతంలోని చాసివ్ యార్‌లో కొంత భాగం నుండి తమ దళాలు వైదొలిగాయని ఉక్రెయిన్ సైన్యం గురువారం తెలిపింది. చాసివ్ యార్ ఎత్తైన ప్రదేశంలో ఉంది. రష్యన్ దళాలు పట్టణంపై పూర్తి నియంత్రణను ఏర్పరుచుకుంటే, ఉక్రెయిన్ నగరాలైన క్రామాటోర్స్క్, స్లోవియన్స్క్ వైపు పశ్చిమ దిశగా ముందుకు సాగడానికి వారు దానిని స్టేజింగ్ పోస్ట్‌గా ఉపయోగించుకోవచ్చు.

కన్సర్వేటివ్స్‌కు గట్టి ఎదురుదెబ్బ

- స్టార్మర్‌కు తగ్గిన ఓట్లు
- ఇస్లింగ్టన్‌లో కార్బిన్ తిరుగులేని విజయం
- గాజా అనుకూల వాదులు నల్గురు ఎన్నిక
- బ్రిటన్ ఎన్నికల్లో సంచలనాలు

లండన్: నయా ఉదారవాద విధానాలను ఉధృతంగా అమలు చేసిన కన్సర్వేటివ్స్ పార్టీ రెండు వందల ఏళ్ల ఆ పార్టీ చరిత్రలోనే ఎన్నడూ లేనంత ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. గురువారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఇంతవరకు వెల్లడైన ఫలితాలు, ఆధిక్యతలను బట్టి 650 స్థానాలున్న ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ కామన్స్)లో లేబర్ పార్టీ 412 స్థానాలతో అఖండ విజయం సాధించగా, కన్సర్వేటివ్ పార్టీ (టోరీలు అని కూడా పిలుస్తారు) 121 స్థానాలతో విపత్కర ఓటమిని చవి చూసింది. లిబరల్ డెమొక్రాట్లు 71 స్థానాలు దక్కించుకున్నారు. స్కాట్లండ్ నేషనలిస్టు పార్టీ (ఎస్‌ఎన్‌ఎఫ్) తొమ్మిది స్థానాలు , ఎన్ ఎఫ్ ఏడు స్థానాలు సాధించాయి. ఇతరులు 28 స్థానాలు గెలుచుకున్నారు. లేబర్ పార్టీకి గతసారితో పోల్చితే 214 స్థానాలు అధికంగా వచ్చాయి. కన్సర్వేటివ్స్‌కు గతసారితో పోల్చితే 252 స్థానాలు తగ్గాయి. లిబరల్ డెమొక్రాట్స్‌కు గతసారితో పోల్చితే 63 సీట్లు అధికంగా వచ్చాయి.

మొత్తం మీద బ్రిటిష్ ప్రజలు పద్నాలుగేళ్ల టోరీల ముదనష్టపు పాలనకు చరమగీతం పాడారు. లేబర్ పార్టీ ఎన్నికల చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అసాధారణమైన విజయం సాధించింది. 'ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్ ' పద్ధతిలో ఎన్నికల్లో లోపాన్ని ఈ ఎన్నికలు మరోసారి ఎత్తి చూపాయి. లేబర్ పార్టీకి లభించిన ఓట్ల శాతం కన్నా సీట్లు రెట్టింపు స్థాయిలో వచ్చాయి. 2017లో కార్బిన్ నాయకత్వంలో లేబర్ పార్టీ సాధించిన ఓట్ల శాతంతో పోల్చితే ఈ సారి బాగా తగ్గింది. అప్పుడు 40శాతానికిపైగా ఓట్లు రాగా, ఇప్పుడు స్టార్మర్ నేతృత్వంలోని ఆ పార్టీ 36 శాతం ఓట్లు మాత్రమే సాధించింది.

లేబర్ పార్టీ ఇంతటి భారీ విజయం సాధించిందంటే అందుకు మితవాదుల ఓట్లలో చీలిక ఒక కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. లేబర్ పార్టీ నేత స్టార్మర్‌కు గత సారి కన్నా ఈ సారి ఓట్లు బాగా తగ్గాయి. లేబర్ పార్టీ నుంచి బహిష్కరించబడిన వామపక్ష వాది జెరిమి కార్బిన్ ఇస్లింగ్టన్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి మరోసారి తిరుగులేని విజయం సాధించడం ఈ ఎన్నికల్లో ఒక హైలైట్. 40 ఏళ్లుగా వరుసగా పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్బిన్‌కు 24, 120 ఓట్లు రాగా, ఆయన సమీప ప్రత్యర్థి లేబర్ పార్టీకి చెందిన అభ్యర్థి ప్రఫుల నార్గుండ్‌కు 16, 873 ఓట్లు వచ్చాయి. కార్బిన్ విజయం లేబర్ పార్టీ నేత, కొత్త ప్రధాని కీర్ స్టార్మర్‌కు ఒక గట్టి హెచ్చరిక అనే చెప్పాలి. కన్సర్వేటివ్స్ రెండంకెల స్కోరుకు చేరుకోవడం కూడా గగనమేనని ఎగ్జిట్ పోల్స్ వేసిన అంచనా వేశాయి. గ్రీన్స్, రిఫార్మ్ పార్టీలకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. చెరి నాలుగు స్థానాలతో ఆ రెండు పార్టీలు సరిపెట్టుకున్నాయి. స్కాటిష్ నేషనల్ పార్టీకి కూడా చేదు అనుభవమే ఎదురైంది. స్కాట్లండ్‌లో 2015లో తొలిసారి దెబ్బ తిన్న లేబర్ పార్టీ ఈ ఎన్నికల్లో గణనీయంగా పుంజుకోవడంతో స్కాటిష్ నేషనల్ పార్టీ గత సారి ఎన్నికలతో పోల్చితే ఈ సారి 38 సీట్లు కోల్పోయింది.

ఈ ఎన్నికల్లో ఓడిపోయిన ప్రముఖుల్లో మాజీ ప్రధానులు, డేవిడ్ కెమరాన్, థెరిసా మే, లిజ్ ట్రస్, సునాక్ కేబినెట్‌లోని పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, ఉన్నారు.

గాజాలో శాంతి, సంఘీభావానికి అనుకూలంగా పోరాడిన నల్గురు గెలుపొందారు. వీరంతా లేబర్ పార్టీపై గెలవడం విశేషం. ఇంకొందరు కొద్ది తేడాతో ఓటమి పాలయ్యారు. ఇండిపెండెంట్ అభ్యర్థి షౌకత్ ఆడమ్ లీషెస్టర్ సౌత్ స్థానంలో లేబర్ పార్టీ అభ్యర్థి జాన్ అశ్వర్త్‌ను వెయ్యి ఓట్ల తేడాతో ఓడించి సంచలనం సృష్టించారు. బ్లాక్‌బర్న్‌లో అద్నాన్ హుస్సేన్ లేబర్ పార్టీకి చెందిన సమీప ప్రత్యర్థి కేట్ హాలెర్న్‌పై 132 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. డ్యూస్‌బరీలో ఇక్బాల్ మహ్మద్, బర్మింగ్‌హామ్ పెర్రీ బార్‌లో అయూబ్ ఖాన్ విజయం సాధించారు.

పుస్తకాలు కూడా ఇవ్వలేని కేంద్రం

- ముద్రణకు కూడా నోచుకోని ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలు
- మోడీ సర్కార్ తీరుపై జైరాం రమేశ్ విమర్శలు

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కార్ కనీసం పాఠ్యపుస్తకాలను కూడా ఇవ్వని దుస్థితిలో ఉందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సామాజిక మాధ్యమాల్లో ఈ మేరకు ఆయన పోస్టు చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా.. జాతీయ విద్య పరిశోధన మండలి (ఎన్‌సిఇఆర్‌టి) అందజేసే ఆరో తరగతి పుస్తకాలు ఇప్పటికీ ముద్రణకు నోచుకోవడం లేదని ఆయన విమర్శించారు. అరకొరగా ముద్రణ పూర్తి అయిన పుస్తకాలు పంపిణీ చేయడంలోనూ కేంద్రం మీనమేషాలు లెక్కిస్తోందని ఆయన తప్పుబట్టారు. విద్యా వ్యవస్థ మొత్తాన్ని మోడీ సర్కార్ నాశనం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థత ప్రతీరోజూ కొత్త స్థాయిలకు చేరుకుంటుందని తెలిపారు. 'నేషనల్ టెస్టింగ్ అథారిటీ (ఎన్‌టిఎ) ద్వారా పరీక్షల ప్రక్రియను నాశనం చేసిన మోడీ సర్కార్ ఇప్పుడు చిన్న పిల్లల చదువులనూ నాశనం చేస్తోంది' ఆయన ఘాటుగా విమర్శించారు. ఆరో తరగతి విద్యార్థులకు సైన్స్, గణితం, సామాజిక శాస్త్రాల పాఠ్య పుస్తకాలను ప్రచురించడంలో ఎన్‌సిఇఆర్‌టి విఫలమైందన్నారు. నేషనల్ సిలబస్ అండ్ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కమిటీ (ఎన్‌ఎస్‌టిసి) ఇంకా పాఠ్యపుస్తకాలను ఖరారు చేయలేదని చెప్పారు. ముద్రణకు మరో 10 నుంచి 15 రోజులు పడుతుందని ఆయన అన్నారు. కొత్త పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి రెండు నెలలు పడుతుందని అధికారులు భావిస్తున్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి 3వ, 6వ తరగతులకు కొత్త పాఠ్యపుస్తకాలు ప్రవేశపెడతామని ఎన్‌సిఇఆర్‌టి గతంలోనే ప్రకటించింది. అయితే 6వ తరగతి పాఠ్య పుస్తకాలు ఆలస్యమవుతున్నాయి. ఏప్రిల్ నుంచే వీటిని బోధించాల్సి ఉంది.

భారత సంతతి హవా

లండన్: బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో భారత సంతతి హవా కొనసాగింది. దాదాపు 26 మంది భారత మూలాలున్న అభ్యర్థులు అక్కడి పార్లమెంటు కు ఎన్నికయ్యారు. అయితే ప్రవాసాంధ్రులు ఆచంద్ర కన్నెగంటి, ఉదయ్ నాగరాజు ఓటమి చవిచూశారు. రిషి సునాక్ రిచ్‌మండ్ అండ్ నార్తర్న్ అలర్టన్ స్థానం నుంచి మరోసారి గెలుపొందారు. మాజీ హోంమంత్రులు సుయెల్లా బ్రేవర్మన్, ప్రీతి పటేల్‌లు తమ స్థానాలను పదిలంగా ఉంచుకోగలిగారు. భారత సంతతికి చెందిన క్లెయిర్ కౌటిన్హో కూడా విజయం సాధించారు. సౌత్‌వెస్ట్ హెర్ట్‌ఫోర్డ్‌షైర్ నుంచి కన్జర్వేటివ్ నేత గగన్ మొహీంద్ర, లైసెస్టర్ ఈస్ట్ నుంచి శివాని రాజా గెలుపొందారు. లేబర్ పార్టీకి చెందిన రాజేశ్ అగర్వాల్‌పై శివాని విజయం సాధించారు. కన్జర్వేటివ్ పార్టీకి చెందిన శైలేష్ వారా, తొలిసారి పోటీలో దిగిన అమీత్ జోగియాలు స్వల్ప తేడాతో ఓటమి చెందారు. లేబర్ పార్టీ నుంచే సీమా మల్హోత్రా (వాల్‌సాల్ నియోజకవర్గం), వాలెరీ వాజ్ (బ్లోక్స్‌విచ్).. ఆమె సోదరి కీత్ వాజ్, లీసా నాండీ (విగాన్)లు భారీ మెజార్టీతో గెలుపొందారు. బ్రిటిష్ సిక్కు ఎంపీలు ప్రీత్ కౌర్ గిల్, తన్‌మంజిత్ సింగ్ ధేసిలు మరోసారి విజయం సాధించారు. నావెందు మిశ్రా, రదిమా విటోమ్‌లు లేబర్‌పార్టీ నుంచి భారీ మెజార్టీతో తమ స్థానాలను పదిలపరచుకున్నారు. లేబర్ పార్టీకి చెందిన జాస్ అథ్వాల్, బాగీ శంకర్, సత్వీర్ కౌర్, హర్‌ప్రీత్ ఉప్పల్, వారిందర్ జస్, గురిందర్ జోసన్, కనిష్క నారాయణ్, సోనియా కుమార్, సురీనా బ్రాకెన్‌బ్రిడ్జ్, కిరిత్ ఎంట్‌విజిల్, జీవన్ సంధేర్, సోజాన్ జోసెఫ్‌లు తొలిసారిగా బ్రిటన్ పార్లమెంటులో అడుగుపెట్టనున్నారు. వీరితోపాటు లిబరల్ డెమోక్రాట్ తరఫున మునిరా విల్సన్ మరోసారి విజయం సాధించారు. ఇంగ్లండ్, స్కాట్లాండ్, వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్ వ్యాప్తంగా 650 పార్లమెంటు స్థానాలున్నాయి.

రోడ్రిగ్స్ పోరాటం వృథా

- తొలి టి20 దక్షిణాఫ్రికా చేతిలో అమ్మాయిల ఓటమి
- బ్రిట్స్, కాప్ అర్ధసెంచరీలు

చెన్నై: భారత పర్యటనలో వచ్చిన దక్షిణాఫ్రికా మహిళలకు ఊరట లభించింది. వన్డే సిరీస్‌తోపాటు ఏకైక టెస్ట్‌లోనూ ఘన విజయం సాధించిన టీమిండియా మహిళలు శుక్రవారం దక్షిణాఫ్రికా మహిళలతో జరిగిన తొలి టి20లో ఓటమిపాల య్యారు. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఆ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ బృందం 12పరుగుల తేడాతో ఓడింది. చెపాక్ స్టేడియంలో జరిగిన తొలి టి20లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 189పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో భారత మహిళలజట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 4వికెట్లు కోల్పోయి 177పరుగులే చేసింది. భారీ ఛేదనలో జెమీమా రోడ్రిగ్స్(53 నాటౌట్), స్మృతి మంధాన(46)లు అదరగొట్టినా ఓటమి తప్పలేదు. ఓపెనర్లు షఫాలీ వర్మ, మంధాన రాణించడంతో 5వ ఓవర్‌లోనే స్కోర్ 50 దాటించారు. పవర్ ప్లే మరో నాలుగు బంతుల్లో ముగుస్తుందనగా అయబొంగ ఖాకా డేంజరస్ షఫాలీని వెనక్కి పంపింది. ఆ తర్వాత దయలాన్ హేమలత.. విఫలమైంది. ఆకాసేపటికే మంధాన స్టంపౌట్‌గా వెనుదిరిగింది. ఆ పరిస్థితుల్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(35 నాటౌట్), జెమీమా రోడ్రిగ్స్ (53 నాటౌట్)లు గెలిపించే బాధ్యత తీసుకున్నారు. ఆఖరి మూడు ఓవర్లలో ఇద్దరూ వీరకొట్టుడు కొట్టారు. 19వ ఓవర్ ఆఖరి బంతికి సిక్సర్‌తో జెమీమా అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. ఇక చివరి ఓవర్లో హర్మన్‌ప్రీత్ తొలి బంతికే బౌండరీ కొట్టినా.. ఆ తర్వాత పరుగులు రాబట్టలేకపోయింది.

దంచేసిన బ్రిట్స్, కాప్..

దక్షిణాఫ్రికా జట్టులో ఓపెనర్ బ్రిట్స్, మారిజానే కాప్ అర్ధసెంచరీలతో మెరిసారు. వీరిద్దరూ 2వ వికెట్‌కు ఏకంగా 96పరుగులు జతచేశారు. దీంతో దక్షిణాఫ్రికా జట్టు భారీస్కోర్ సాధించింది. దక్షిణాఫ్రికా ఓపెనర్, కెప్టెన్ వోల్వ్‌డార్ట్(33) త్వరగా ఔటైనా.. ఆ తర్వాత వీరిద్దరూ మరోవికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. చివర్లో ధాటిగా ఆడే క్రమంలో తొలుత కాప్(57) ఔటైనా.. చివరి బంతి వరకు బ్రిట్(81) క్రీజ్‌లో నిలిచింది. పూజ వస్త్రాకర్ వేసిన చివరి బంతికి బ్రిట్ ఔటవ్వడం, దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగియడం ఒకేసారి జరిగిపోయాయి.

స్కోర్‌బోర్డు...

దక్షిణాఫ్రికా మహిళల ఇన్నింగ్స్: వోల్వ్‌డార్డ్ (బి)రాధా యాదవ్ 33, తంజిమ్ బ్రిట్స్ (సి)రాధా యాదవ్ (సి)పూజ వస్త్రాకర్ 81, మారిజానే కాప్ (సి)ఆషా శోభన (బి)రాధా యాదవ్ 57, ట్రయాన్ (సి)రేణుకా సింగ్ (బి)పూజ వస్త్రాకర్ 12, నడైన్ డి క్లార్క్ (నాటౌట్) 1, అదనం 5. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 189పరుగులు. **వికెట్ల పతనం:** 1/50, 2/146, 3/184, 4/189 **బౌలింగ్:** రేణుకా సింగ్ 4-0-42-0, పూజ వస్త్రాకర్ 4-0-23-2, రాధా యాదవ్ 4-0-40-2, దీప్తి శర్మ 4-0-45-0, ఆశా శోభన 4-0-39-0

భారత మహిళల ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (సి)జల్టా (బి)ఖాకా 18, స్మృతి మంధాన (సి)జల్టా (బి)ట్రయాన్ 46, హేమలత (బి)క్లార్క్ 14, హర్మన్‌ప్రీత్ కౌర్ (స్టంప్)జల్టా (బి)మాబా 35, రోడ్రిగ్స్ (నాటౌట్) 53, అదనం 11. (20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 177పరుగులు. **వికెట్ల పతనం:** 1/56, 2/87, 3/87, 4/177 **బౌలింగ్:** ఖాకా 4-0-39-1, ట్రయాన్ 4-0-32-1, మార్క్స్ 3-0-36-0, క్లార్క్ 4-0-30-1, మాబా 4-0-32-1, డెర్క్‌సన్ 1-0-8-0

ప్రి క్వార్టర్స్‌కు అల్కరాజ్

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్ ఫైనల్లోకి 3వ సీడ్, స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్, ప్రవేశించారు. గురువారం జరిగిన మూడోరౌండ్ పోటీలో అల్కరాజ్ ఐదుసెట్ల ఉత్కంఠ పోరులో 29వ సీడ్, అమెరికాకు చెందిన టాఫీని చిత్తు చేశాడు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ 5-7, 6-2, 4-6, 7-6(7-2), 6-2తో టఫీని చిత్తుచేశాడు. మరో మ్యాచ్‌లో మెద్వదెవ్ 6-1, 6-3, 4-6, 1-1 ఆధిక్యతలో ఉన్న దశలో మ్యాచ్ నిలిచింది. మరో పోటీలో 12వ సీడ్ టామీ పాల్(అమెరికా) వరుససెట్లలో బంబ్లిన్(కజకిస్తాన్)ను ఓడించాడు. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో పాల్ 6-3, 6-4, 6-2తో 22వ సీడ్ బబ్లిక్‌ను ఓడించాడు.

ఇక మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్స్‌కు 7వ సీడ్ పోలిని(ఇటలీ), అన్‌సీడెడ్ రాడోసివిక్(ఆస్ట్రేలియా) ప్రవేశించారు. పోలిని 7-6(7-4), 6-1తో ఆండ్రెస్కూ(కెనడా)ను ఓడించగా.. రాడోసివిక్ 7-6(7-4), 7-6(8-6)తో ఝూ(చైనా)పై చెమటోడ్చి నెగ్గింది. మరో పోటీలో 12వ సీడ్, అమెరికాకు చెందిన కీస్ 6-4, 6-3తో 18వ సీడ్ కోస్ట్యుక్(ఉక్రెయిన్)ను ఓడించగా.. 19వ సీడ్ నవర్రో మూడుసెట్ల హోరాహోరీ పోరులో రష్యాకు చెందిన షాడైర్‌ను చిత్తుచేసింది. ఈ మ్యాచ్‌లో నవ్వారో 2-6, 6-3, 6-4 ఓడించింది. మరో పోటీలో అన్‌సీడెడ్ బడోసా(స్పెయిన్) 7-6(8-6), 4-6, 6-4తో 14వ సీడ్ కసట్కినా(రష్యా)ను ఓడించింది.

పురుషుల డబుల్స్‌లో 2వ రౌండ్‌కు చేరిన యుకీ బాంబ్రీ-డివెట్టి(ఫ్రాన్స్) జంట 6-4, 4-6, 3-6తో జర్మనీకి చెందిన 8వ సీడ్ జంట చేతిలో ఓటమిపాలయ్యారు.



పారిస్ ఒలింపిక్స్‌కు వెళ్లే భారత ఆటగాళ్ల తొలి బృందంతో ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం సమావేశమయ్యారు. ఈసారి ఒలింపిక్స్‌లో అత్యధిక పతకాలు సాధించి 2036 ఒలింపిక్స్‌కు భారత్ బిడ్ దాఖలుకు మార్గం సుగమం చేయాలంటూ.. అథ్లెట్లకు శుభాకాంక్షలు తెలిపారు.

గిల్ కెప్టెన్సీకి పరీక్ష

నేడు జింబాబ్వేతో తొలి టి20
సా. 4.30గం॥ల నుంచి

హరారే: జింబాబ్వే పర్యటనకు వెళ్లిన టీమిండియా యువ జట్టు నేడు తొలి పరీక్షను ఎదుర్కోనుంది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారతజట్టు యువ క్రికెటర్లతో పటిష్ఠంగా ఉంది. టీమిండియా తరఫున టి20 ప్రపంచకప్‌లో ఆడిన ఒక్క ఆటగాడు కూడా పాల్గొనడం లేదు. దూబే, జైస్వాల్, సంజు తొలుత జింబాబ్వే టూర్‌కు జట్టులో చోటు దక్కించుకున్నా.. బార్బొడాస్‌ను తిరిగి రావడంలో ఆలస్యం కావడంతో తొలి రెండు టి20లకు దూరమయ్యారు. వారి స్థానంలో సాయి సుదర్శన్, జితేశ్ శర్మ, హర్షిత్ రాణా చోటు దక్కించుకొన్నారు. కోహ్లి, రోహిత్, జడేజా టి20లకు గుడ్‌బై చెప్పడంతో టీమిండియాలో సుస్థిర స్థానంకోసం గైక్వాడ్, అభిషేక్ శర్మతోపాటు, రియాన్ పరాగ్ వంటి ఐపిఎల్ స్టార్స్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మరోవైపు జింబాబ్వే జట్టు ఈసారి టి20 ప్రపంచకప్‌కు అర్హత సాధించలేకపోవడంతో ఐసిసి పాయింట్ల పరంగానూ ఆ జట్టుకు గెలుపు తప్పనిసరి. ఇరుజట్ల మధ్య ఐదు టి20ల సిరీస్ హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరగనుంది.

Discover Your Strength, Shape Your Destiny

Applications are invited from unmarried men and women candidates (fulfilling the conditions of nationality as laid down by the Govt. of India) for becoming Permanent Commissioned Officers in Executive and Technical branches under 10+2 B Tech Cadet Entry Scheme after undergoing four year B Tech course at the prestigious Indian Naval Academy, Ezhimala.

Vacancies & Age - The age eligibility & vacancies for the course are as under:-

Branch	Vacancy	Qualification	Gender	Age
Executive & Technical Branch*	40	Passed Senior Secondary Examination (10+2) or its equivalent examination from recognised Board with at least 70% aggregate marks in Physics, Chemistry and Mathematics (PCM) and at least 50% marks in English (either in Class X or Class XII)	Men and Women (maximum of 08 vacancies for women)	Born Between 02 Jul 2005 and 01 Jan 2008 (both dates inclusive).

Date of Opening: **06 July 2024**
Last Date: **20 July 2024**

*Branch allocation viz. Executive & Technical (Engineering & Electrical) will be undertaken at INA

For eligibility criteria and details visit -www.joinindiannavy.gov.in and Employment News dated 29 Jun 24.

davp 10701/13/0004/2425

JOIN INDIAN NAVY

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68